సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
శనివారం । 9 । నవంబర్ । 2024



యాసంగికి విత్తనాలు సిద్ధం
యాసంగి సీజన్‌లో అవసరమైన విత్తనాలను తెలంగాణ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ రైతులకు అందుబాటులోకి తెచ్చింది. 8లో



హామీల అమలులో విఫలం
కాంగ్రెస్ ఎన్నికల హామీలను నెరవేర్చడంలో విఫలమైందని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు ఆరోపించారు. 8లో

గరిష్ఠం / కనిష్ఠం
32° / 20°

వాతావరణం
జిల్లాలో శనివారం మధ్యాహ్నం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. రాత్రి వేళ చలి ప్రభావం పెరుగుతుంది.

న్యూస్‌రీల్

రామయ్యకు సువర్ణ తులసీ అర్చన



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: శ్రీసీతారామచంద్ర స్వామివారి దేవస్థానంలో శుక్రవారం సువర్ణ తులసీ అర్చన నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం స్వామివారిని బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావచనం జరిపించారు. ఆ తర్వాత స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీతధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ వేడుకను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

డిసెంబర్ 31 నుంచి అధ్యయనోత్సవాలు

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామివారి దేవస్థానంలో డిసెంబర్ 31 నుంచి జనవరి 23 వరకు వైకుంఠ ఏకాదశి ప్రయుక్త అధ్యయనోత్సవాలు నిర్వహించనున్నట్లు ఈఓ రమాదేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 31న మత్స్యావతారం, జనవరి 1న కూర్మావతారం, 2న వరాహావతారం, 3న నరసింహావతారం, 4న వామనావతారం, 5న పరుశురామావతారం, 6న శ్రీరామవతారం, 7న బలరామావతారం, 8న శ్రీకృష్ణావతారం, 9న తెప్పోత్సవం, 10న ఉత్తర ద్వారదర్శనంతో పాటు ప్రతిరోజు స్వామివారికి ప్రత్యేక సేవలు నిర్వహిస్తామని వివరించారు. చివరిగా జనవరి 26న విశ్వరూప సేవ వైభవంగా జరుగుతుందని తెలిపారు.

పెద్దమ్మతల్లికి పంచామృతాభిషేకం



అమ్మవారికి అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లికి వైభవంగా పంచామృతాభిషేకం నిర్వహించారు. మండలంలో కొలువైఉన్న శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి)ఆలయంలో శుక్రవారం అర్చకులు అమ్మవారి జన్మస్థలం వద్ద పంచామృతం, పసుపు, కుంకుమ, గాజులు, హారతి సమర్పించారు. అనంతరం ఆలయంలోని మూలవిరాట్‌కు పంచామృతంతో అభిషేకం జరిపారు. పంచహారతులు, నివేదన, నీరాజనం, మంత్రపుష్పం పూజలతోపాటు కుంకుమపూజ, గణపతిహోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈఓ ఎన్.రజనీకుమారి పాల్గొన్నారు.

తాలిపేరు ప్రాజెక్టులో చేప పిల్లల విడుదల

చర్ల: తాలిపేరు మధ్యతరహా ప్రాజెక్టులో శుక్రవారం మత్స్యశాఖ అధికారులు చేప పిల్లలను వదిలారు. భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు చేతుల మీదుగా బొచ్చె, బంగారు తీగె తదితర రకాల చేప పిల్లలను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖాధికారి ఇంతియాజ్ మహ్మద్ ఖాన్, తహసీల్దార్ శ్రీనివాస్, సీఐ రాజువర్మ, ఎంపీడీఓ ఈదయ్య, ఎంపీఓ వలీ హజ్రత్, ఏఓ రాంనవీన్ తదితరులు పాల్గొన్నారు.

భారజల కర్మాగారాన్ని సందర్శించిన సీఈ



యాష్‌పాండ్ వద్ద సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న సీఈ సత్యకుమార్

అశ్వాపురం: మణుగూరు భారజల కర్మాగారాన్ని భారజల బోర్డు చైర్మన్ అండ్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఎస్. సత్యకుమార్ శుక్రవారం సందర్శించారు. కర్మాగారం సమీపంలోని అమ్మగారిపల్లి గ్రామంలో యాష్‌పాండ్ వద్ద నిర్మించిన సీసీ రోడ్డును సీఈ ప్రారంభించారు. అనంతరం కర్మాగారాన్ని సందర్శించారు. ప్లాంటులో వివిధ విభాగాలను పరిశీలించారు. పరిపాలన విభాగం కార్యాలయంలో జీఎం, అధికారులతో సమావేశమయ్యారు. ఈ కార్యక్రమంలో భారజల బోర్డు డైరెక్టర్ వీవీఎస్‌పీ.ప్రసాద్, జీఎం ఎస్.జగ్గారావు, అధికారులు పాల్గొన్నారు.

నజర్ పెట్టాలని తూనికలు, కొలతల శాఖను కోరుతున్న రైతులు

- సీసీఐ కొర్రీలతో ప్రైవేటు వ్యాపారుల వైపే పత్తి రైతుల మొగ్గు
- ఇదే అదనుగా ధరతోపాటు తూకాల్లో మోసాలకు ప్లాన్
- గత సీజన్‌లో పలుచోట్ల కేసులు నమోదు

బూర్గంపాడు మండలంలో జిన్నింగ్ మిల్లులో వేబ్రిడ్జిని తనిఖీ చేస్తున్న అధికారులు



తూకంలో మోసపోకుండా..

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఆరుగాలం శ్రమించి పండించిన పత్తి పంటను అమ్ముకునే సమయంలో కొందరు వ్యాపారులు, దళారులు కాస్తైనా కనికరం లేకుండా తప్పుడు తూకాలతో రైతుల నోట్లో మట్టి కొట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ తరహా అక్రమాలకు ఆదిలోనే అడ్డుకట్ట వేయాలని పలువురు తూనికలు కొలతల శాఖ అధికారులను కోరుతున్నారు.

ఇంటి వద్దే అమ్మకాలు

తేమశాతం పేరుతో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా పెట్టే కొర్రీలు, నెట్‌వర్క్ సమస్యల వల్ల త్వరగా పూర్తికాని ఆధార్ అథెంటికేషన్, రవాణా ఖర్చులు.. ఇలా పలు కారణాలతో రైతులు ఇళ్లు, చేల వద్దే పంట దిగుబడి అమ్ముకుంటున్నారు. ఈ క్రమంలో వ్యాపారులు, దళారులు ట్రాలీలు వేసుకుని ఊరూరా తిరుగుతూ అక్కడికక్కడే పంటను కొనుగోలు చేసి నగదు చెల్లిస్తున్నారు. గతేడాది కూడా సీసీఐ కొనుగోలు కేంద్రాల కంటే చేల దగ్గరే పత్తి ఎక్కువగా అమ్ముడైంది. అయితే ఏజెన్సీ రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా తీసుకున్న కొందరు దళారులు, వ్యాపారులు మోసాలకు తెర లేపారు. ట్యాంపరింగ్ చేసిన ఎలక్ట్రానిక్ వేయింగ్ మిషన్లతో రైతులను మోసం చేశారు. కొన్ని చోట్ల తూకంలో మోసాలను గమనించిన రైతులు సదరు వ్యక్తులను పట్టుకుని దేహశుద్ధి చేశారు. పోలీసులకు అప్పగించారు. గత సీజన్‌లో ఈ తరహా కేసులు చర్ల, పాల్వంచ, చంద్రుగొండ మండలాల్లో చోటుచేసుకున్నాయి. బయటపడకుండా మోసపోయిన రైతులు ఎందరో ఉన్నారు. ప్రస్తుతం పత్తి కొనుగోలు సీజన్ ఆరంభమైన నేపథ్యంలో రైతులకు అన్యాయం జరగకుండా తూనికలు, కొలతల శాఖ అధికారులు జిన్నింగ్ మిల్లులు, ప్రైవేటు కొనుగోలు కేంద్రాలు, గ్రామాల్లో రైతుల ఇంటి దగ్గర జరిగే కొనుగోళ్లపై నజర్ పెట్టాల్సిన అవసరం ఉంది.

నిబంధనలు ఇలా..

రైతుల నుంచి వ్యవసాయ ఉత్పత్తులు పత్తి, మిర్చి తదితర పంటలు కొనుగోలు చేయాలంటే వ్యాపారులు లైసెన్స్‌లు తీసుకోవాల్సి ఉంటుంది. వీటిని వ్యవసాయ మార్కెట్ కమిటీ జారీ చేస్తుంది. ఈ సమయంలో వ్యాపారులకు సంబంధించిన ఆర్థిక పరిస్థితి, గోదాంల నిల్వ సామర్థ్యం, కాంటాల పారదర్శకత తదితర వివరాలను తెలుసుకునే వీలుంటుంది. పత్తి, మిర్చి కొనుగోలు సమయంలో తూకం వేసేందుకు ఎలక్ట్రానిక్ కాంటాలను ఉపయోగించాలి. సంప్రదాయ రాళ్ల కాంటాలు ఉపయోగించడాన్ని తగ్గించాలి. ఈ కాంటాలను కూడా ప్రతీ వ్యవసాయ సీజన్‌లో తనిఖీలు చేసి సీల్ వేయాల్సి ఉంటుంది.

అసలే 'మద్దతు' లేదు

దుక్కి దున్నడం మొదలు పెట్టినప్పటి నుంచి పంట చేతికి వచ్చే వరకు రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమయానికి వర్షాలు పడకపోయినా, అధికంగా వర్షాలు, వరదలు వచ్చినా ఇబ్బందే. ఇక విత్తనాలు మొదలు పురుగుల మందు వరకు ప్రతీ చోట కల్తీ లేకుండా కొనుగోలు చేయడం కష్టమైన వ్యవహారం. ఇన్ని కష్టాలు పడినా పంట చేతికి వచ్చే సమయంలో కోత పని చేసే కూలీల కోసం కూడా రైతులు ఎదురు చూడాల్సిన పరిస్థితి ఉంది. ఈ సీజన్‌లో పత్తి క్వింటాల్‌కు ప్రభుత్వం రూ.7,521 మద్దతు ధరగా ప్రకటించింది. అయితే ఇళ్ల దగ్గరే అమ్మకాలు చేయడం వల్ల క్వింటాల్ పత్తిని ఐదు నుంచి ఆరు వేల రూపాయల మధ్యనే అమ్ముకుని రైతులు నష్టపోతున్నారు. కనీసం తూకంలో అయినా రైతులు నష్టపోకుండా జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

విస్తృతంగా తనిఖీలు చేపడతాం

పత్తి కొనుగోళ్లు మొదలయ్యాయి. రైతులు నష్టపోకుండా విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తాం. శుక్రవారం నుంచి వారం రోజులపాటు ఈ తనిఖీలు ఉంటాయి. సీజన్ ఆరంభంలోనే తనిఖీలు ఎక్కువగా చేపట్టడం వల్ల సానుకూల ఫలితాలు ఉంటాయి.
– మనోహర్, జిల్లా తూనికలు, కొలతల శాఖ అధికారి

మునగ సాగుతో ప్రయోజనాలు

కలెక్టర్ జితేష్ వి.పాటిల్



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్

చుంచుపల్లి: మునగసాగుతో రైతులకు అనేక ప్రయోజనాలు ఉన్నాయని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఇల్లెందు, టేకులపల్లి, ఆళ్లపల్లి, గుండాల, లక్ష్మీదేవిపల్లి ఎంపీడీవోలు, ఏపీవోలు, ఎంఏవోలు, ఏఈఓలు, టీఏలు, ఈసీలు, ఎఫ్ఏలు, రైతులకు డీఆర్డీఏ ఆధ్వర్యంలో మునగ సాగుపై నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. మునగ సాగుకు ఉపాధి హామీ పథకం ద్వారా కూలి, మెటీరియల్ రూపంలో డబ్బులు అధికంగా వచ్చే అవకాశం ఉందన్నారు. మునగ కాయల అమ్మకం, ఆకుల పొడి, గింజల నుంచి తీసే నూనె అమ్మకం ద్వారా ఆదాయం వస్తుందన్నారు. ప్రతి వంద మంది రైతుల్లో కనీసం ఐదుగురు మునగ సాగు చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ వారంలో సాగుకు సన్నద్ధం కావాలన్నారు. అనంతరం రైతుల సందేహాలను నివృత్తి చేశారు. మార్కెటింగ్‌కు ప్రోత్సాహం, కలుపు తీసే యంత్రాలు, మునగ ఆకు పొడి చేసేందుకు యంత్రాలు, పోడు భూముల్లో బోరు వేసుకునేలా అనుమతులు ఇవ్వాలని పలువురు రైతులు కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, జిల్లా ఉద్యాన శాఖ అధికారి కిషోర్,పలువురు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

సాగును ప్రోత్సహించాలి

చంద్రుగొండ : మునగ పంట సేద్యంపై రైతులను ప్రోత్సహించాలని జెడ్పీ సీఈఓ చంద్రశేఖర్ మండల అధికారులకు సూచించారు. మండలంలోని రావికంపాడు గ్రామంలో రైతు కోటయ్య 32 గుంటల భూమిలో ఏడు రకాల కూరగాయలతోపాటు మునగ సాగు చేస్తుండగా, పంటలను శుక్రవారం సీఈఓ పరిశీలించారు. ఇతర రైతులకు కూడా అవగాహన పర్చాలని అధికారులకు చెప్పారు. తహసీల్దార్ సంధ్యారాణి, ఎంపీడీఓ బయ్యారపు అశోక్, ఈజీఎస్ ఏపీఓ శ్రీను పాల్గొన్నారు.

ప్రజలకు, పోలీసులకు మధ్య దూరం తగ్గించాలి

ఎస్పీ రోహిత్ రాజు



రాళ్లవాగు బ్రిడ్జి వద్ద పరిశీలిస్తున్న ఎస్పీ రోహిత్ రాజు తదితరులు

కరకగూడెం: ప్రజలకు పోలీసులకు మధ్య దూరాన్ని తగ్గించాలని, అంకితభావంతో విధులు నిర్వర్తించాలని ఎస్పీ బి.రోహిత్ రాజు సూచించారు. శుక్రవారం ఆయన ఏడూళ్ల బయ్యారం, కరకగూడెం పోలీస్ స్టేషన్లను తనిఖీ చేశారు. రికార్డులు, రిసెప్షన్, లాకప్, టెక్నికల్ రూం పరిసరాలను పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫిర్యాదుదారులతో మర్యాదగా మెలగాలన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలని ఆదేశించారు. నిషేధిత సీపీఐ మావోయిస్టుల కదలికలపై నిఘా పెట్టాలన్నారు. అనంతరం భట్టుపల్లి మినీ స్టేడియాన్ని సందర్శించి, మైదానాన్ని అందుబాటులోకి తేవాలని అన్నారు. 1992లో మావోయిస్టులు పేల్చిన రాళ్లవాగు బ్రిడ్జి ప్రాంతాన్ని పరిశీలించి ఆ విషాద సంఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సీఐ వెంకటేశ్వరరావు, ఎస్సైలు రాజ్ కుమార్, రాజేందర్ పాల్గొన్నారు.

పోలీసు హెడ్‌క్వార్టర్‌లో యోగా తరగతులు

కొత్తగూడెంరూరల్: హేమచంద్రాపురంలోని జిల్లా పోలీసు హెడ్ క్వార్టర్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన యోగా తరగతులను ఎస్పీ రోహిత్‌రాజు ప్రారంభించి మాట్లాడారు. యోగా ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు రెహమాన్, సత్యనారాయణ, సీఐలు వెంకటేశ్వర్లు, కరుణాకర్, రమేష్, శివప్రసాద్, ఆర్ఐలు లాల్‌బాబు, సుధాకర్, నర్సింహారావు, కృష్ణారావు పాల్గొన్నారు.

జపాన్‌లో శిక్షణకు కొత్తగూడెం నర్సింగ్ ఆఫీసర్



శిక్షణకు ఎంపికైన సూర్ణపు స్వప్న

కొత్తగూడెం రూరల్: జిల్లా సర్వజన ఆస్పత్రి మిడ్ వైఫరీ విభాగానికి చెందిన నర్సింగ్ ఆఫీసర్ సూర్ణపు స్వప్న జపాన్‌లో శిక్షణకు ఎంపికైంది. తెలంగాణలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాల సంఖ్య పెంచేందుకు కొన్నేళ్ల క్రితం మిడ్ వైఫరీ విభాగాన్ని ఏర్పాటుచేశారు. ఇందులో హెడ్‌నర్స్‌లు, నర్సులను కేటాయించి వారి ద్వారా గర్భిణులకు అవగాహన కల్పిస్తున్నారు. ఈక్రమాన జపాన్‌లో మాతాశిశు సంరక్షణకు చేపట్టిన చర్యలతో మాతాశిశు మరణాల రేటు గణనీయంగా తగ్గింది. దీంతో అక్కడ శిక్షణ కోసం తెలంగాణ నుంచి ఇద్దరిని ఎంపిక చేయగా కొత్తగూడెం సర్వజన ఆస్పత్రికి చెందిన స్వప్నతో పాటు వరంగల్ జిల్లాకు చెందిన నస్రీనాకు చోటు దక్కింది. వీరిద్దరు జపాన్‌లోని ప్రభుత్వాస్పత్రుల్లో మాతాశిశు సంరక్షణకు చేపడుతున్న చర్యలపై ఈ నెల11వ తేదీ నుంచి 24వ వరకు శిక్షణ పొందనున్నారు.

అభినందించిన పలువురు

సూపర్‌బజార్(కొత్తగూడెం): జపాన్‌లో శిక్షణకు ఎంపికైన సూర్ణపు స్వప్నను సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్ శుక్రవారం అభినందించారు. నాయకులు అన్నవరపు కనకయ్య, లిక్కి బాలరాజు, డి.వీరన్న, జునుమాల రమేష్, ఆస్పత్రి ఉద్యోగులు సిబ్బంది పాల్గొన్నారు.

న్యాయ సేవాధికార సంస్థను వినియోగించుకోవాలి

న్యాయమూర్తి భానుమతి



మాట్లాడుతున్న న్యాయమూర్తి భానుమతి

జూలూరుపాడు: న్యాయ సేవాధికార సంస్థ సేవలు వినియోగించుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి జి.భానుమతి అన్నారు. జాతీయ న్యాయ సేవాధికార దినోత్సవం సందర్భంగా శుక్రవారం జూలూరుపాడు కేజీబీవీలో ఏర్పాటు చేసిన న్యాయ చైతన్య కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. విద్యార్థులు చెడు మార్గాలను వీడనాడి జీవితంలో ఉన్నత శిఖరాలకు అధిరోహించాలన్నారు. అనంతరం కేజీబీవీ హాస్టల్‌ను తనిఖీ చేశారు. కిచెన్, స్టోర్ రూమ్‌లను పరిశీలించారు. విద్యార్థులు పౌష్టికాహారాన్ని అందించడంతోపాటు, నాణ్యమైన విద్యను అందించాలని కేజీబీవీ ఎస్‌ఓకు సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పి నిరంజన్‌రావు, జూలూరుపాడు సీఐ ఇంద్రసేనా రెడ్డి, న్యాయవాది తెల్లబోయిన రమేష్, కేజీబీవీ ఎస్‌ఓ పద్మజ, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

కిన్నెరసానిని సందర్శించిన సుక్మా డీఎఫ్‌ఓ



కిన్నెరసానిలో సుక్మా జిల్లా డీఎఫ్ఓ అశోక్‌కుమార్ తదితరులు

పాల్వంచరూరల్: పర్యాటక ప్రాంతమైన కిన్నెరసానిని ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుక్మా జిల్లా అటవీశాఖాధికారి(డీఎఫ్ఓ) అశోక్‌కుమార్ పటేల్ శుక్రవారం కుటుంబ సమేతంగా సందర్శించారు. డీర్ పార్కులోని దుప్పులను, మూషిక జింకలను, పర్యావరణ కేంద్రాన్ని, డ్యామ్ పైనుంచి జలాశయాన్ని వీక్షించారు. అనంతరం రిజర్వాయర్‌లో బోటు షికారు చేశారు. వైల్డ్‌లైఫ్ ఎఫ్ఎస్ఓ కిషన్, ఎఫ్‌బీఓ రాములు డీఎఫ్ఓకు జ్ఞాపికను అందజేశారు.

ఆర్టీసీలో ఉత్తమ అవార్డుల ప్రదానం



అవార్డు అందుకుంటున్న మేనేజర్ నాగేశ్వరరావు

చుంచుపల్లి: ఖమ్మం రీజియన్ పరిధిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బందికి శుక్రవారం కొత్తగూడెం ఆర్టీసీ డిపోలో రీజినల్ మేనేజర్ సరిరామ్ ప్రగతి చక్రం పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్రైమాసికంలో ఉత్తమ సేవలందించిన సిబ్బందికి అభినందనలు తెలిపేందుకు అవార్డులతో పాటు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. డిప్యూటీ రీజినల్ మేనేజర్ పవిత్ర, వివిధ డిపోల మేనేజర్లు, డ్రైవర్లు, కండక్టర్లు సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ బస్ స్టేషన్ మేనేజర్‌గా నాగేశ్వరరావు

భద్రాచలంఅర్బన్: ఆర్టీసీ భద్రాచలం బస్ స్టేషన్ మేనేజర్ అల్లం నాగేశ్వరరావుకు ఖమ్మం రీజియన్‌లో ఉత్తమ అవార్డు లభించింది. నాగేశ్వరరావుతోపాటు ఉత్తమ డ్రైవర్లు కేవీ. ప్రసాద్, డీవీ. బాబు, బీఎస్. వాసు, కరీముల్లా, కేఎస్‌రావు, ఎంవీ రావులకు కొత్తగూడెంలో ఆర్టీసీ ఆర్ఎం సరిరామ్, డిప్యూటీ రీజినల్ మేనేజర్ పవిత్ర అవార్డులను అందజేశారు.

నిధుల్లేక.. నీరసం

- భారంగా ఎమ్మార్సీ, సీఆర్పీల నిర్వహణ
- ఆరు నెలలు గడిచినా రూపాయి విడుదల చేయని ప్రభుత్వం
- జిల్లాలో నూతన ఎంఈఓలకు ఆర్థిక సమస్యలు



ఇల్లెందులోని మండల విద్యా వనరుల కేంద్రం

ఇల్లెందురూరల్: విద్యాసంవత్సరం ప్రారంభమై ఆరు నెలలు గడుస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయడంలేదు. ఫలితంగా మండల విద్యా వనరుల కేంద్రా(ఎమ్మార్సీ)లు, క్లస్టర్ పాఠశాలల సముదాయా(సీఆర్పీ)ల నిర్వహణ భారంగా మారింది. ఇటీవల కొత్తగా బాధ్యతలు స్వీకరించిన నూతన ఎంఈఓలు ప్రారంభంలోనే అప్పులను తమ ఖాతాలో జమ చేసుకోవాల్సి వచ్చింది. విద్యా సంవత్సరం ప్రారంభంలో జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో సీనియర్ హెచ్‌ఎంలే ఇన్‌చార్జి ఎంఈఓలుగా విధుల్లో కొనసాగారు. కాగా మండలాల్లో నోడల్ అధికారులుగా ఉన్న ప్రధానోపాధ్యాయులకు ఎంఈఓలుగా పదోన్నతి కల్పిస్తూ గత సెప్టెంబర్ 25న ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో రెగ్యులర్ ఎంఈఓలు ఉత్సాహంతో విధుల్లో చేరారు.

ఎమ్మార్సీలకు రూ.17.02 లక్షలు

జిల్లాలోని 23 మండలాల్లో విద్యాశాఖ కార్యాలయాలు (విద్యా వనరుల కేంద్రాలు) ఉన్నాయి. ఒక్కో ఎమ్మార్సీకి రూ.74 వేల చొప్పున 23 కార్యాలయాలకు రూ.17.02 లక్షలు మంజూరు చేయాల్సి ఉంది. కానీ విద్యా సంవత్సరం ప్రారంభమై ఆరు నెలలు గడిచినా ఎమ్మార్సీ, సీఆర్పీ నిర్వహణకు ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదు. దీంతో వాటి నిర్వహణతోపాటు దుస్తుల కుట్టుకూలి బకాయి విషయమై సమాధానం చెప్పలేక నూతన ఎంఈఓలు సతమతమవుతున్నారు. కార్యాలయాల్లో చిన్నపాటి మరమ్మతులు, విద్యుత్ బిల్లులు, సమావేశాల నిర్వహణ ఖర్చు, ఇంటర్నెట్ వినియోగం, స్టేషనరీ, పత్రికల ఖర్చులను ఎంఈఓలు, ఎమ్మార్సీ సిబ్బంది భరించాల్సి వస్తోంది.

సీఆర్పీలకు 29.70 లక్షలు..

క్లస్టర్ పాఠశాలల సముదాయ కేంద్రాల పర్యవేక్షణ బాధ్యతలను ప్రభుత్వం సీనియర్ గెజిటెడ్ హెచ్‌ఎం లేదా ఎంఈఓలకు అప్పగించింది. ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఇప్పటికే నాలుగు దఫాలుగా పాఠశాల సముదాయ సమావేశాలు నిర్వహించారు. అయినా నిధులు విడుదల కాకపోవడంతో రికార్డుల నిర్వహణ సమావేశాల ఖర్చులకు సంబంధిత అధికారులు ఇబ్బంది పడుతున్నారు. ఫలితంగా పాఠశాలల పర్యవేక్షణ అంతంత మాత్రంగా ఉందనే వాదన వినిపిస్తోంది. జిల్లాలో 90 సీఆర్పీలు ఉండగా, ఏటా ఒక్కో కేంద్రానికి రూ.33 వేల చొప్పున 29.70 లక్షలు నిధులు మంజూరు కావాల్సింది.

అందని కుట్టుకూలి చార్జీలు

ప్రభుత్వం విద్యార్థులకు రెండు జతల ఏకరూప దుస్తులను మంజూరు చేసింది. కుట్టుకు సంబంధించిన బాధ్యతను విద్యాశాఖ ద్వారా పొదుపు సంఘాలకు అప్పగించింది. దీంతో జిల్లా వ్యాప్తంగా 63,399 మంది విద్యార్థులకు రెండు జతలు చొప్పున కుట్టించి పంపిణీ చేశారు. తొలుత జతకు రూ.75 చొప్పున చెల్లిస్తామని చెప్పిన ప్రభుత్వం నిధులు విడుదల సమయంలో ఒక్కో జతకు రూ.50 చొప్పున రూ. 31,61,950 చెల్లించింది. మొదటి జతలో రూ.25 చొప్పున రూ.15,84,975తోపాటు రెండో జతకు రూ.47,54,925 మొత్తంగా రూ.63,39,900ను పొదుపు సంఘాలకు చెల్లించాల్సి ఉంది. ఆయా నిధులు ఎప్పుడిస్తారంటూ మహిళలు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. వారికి సమాధానం చెప్పడం ఎంఈఓలకు తలనొప్పిగా మారింది.

త్వరలోనే మంజూరవుతాయి



జిల్లాలో పాఠశాలల నిర్వహణకు ఇప్పటివరకు 50శాతం నిధులు వచ్చాయి. ఎమ్మార్సీ, సీఆర్పీలకు కూడా త్వరలోనే నిధులు మంజూరవుతాయి. ఏకరూప దుస్తుల కుట్టుకూలి చార్జీలు పొదుపు సంఘాల ఖాతాలోనే త్వరలో జమ అవుతాయి.
– వెంకటేశ్వరాచారి, డీఈఓ.

భద్రాచలం ఆస్పత్రిలో మినీ టీ హబ్..



వైద్యంపై ఆరా తీస్తున్న ఎమ్మెల్యే తెల్లం, పీఓ రాహుల్

భద్రాచలంఅర్బన్: భద్రాచలం ఏరియా ఆస్పత్రిలో మినీ టీ–హబ్ ఏర్పాటు చేయనున్నట్లు ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, భద్రాచలం ఐటీడీఏ పీఓ రాహుల్ తెలిపారు. శుక్రవారం వారు ఆస్పత్రిని సందర్శించి, వైద్యులతో సమీక్ష నిర్వహించారు. వార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మినీ టీ–హబ్‌తోపాటు సీటీ స్కాన్ సెంటర్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఆస్పత్రి పరిసరాల్లో పరిశుభ్రత పాటించాలన్నారు. వైద్యులు సమయపాలన పాటించాలని చెప్పారు. ఏఆర్టీ సెంటర్, పిల్లల సంరక్షణ కేంద్రం, ల్యాబ్, లేబర్ రూమ్స్, మార్చురీ గది, ఆయుర్వేద వైద్యశాలను సందర్శించి రోగుల పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామకృష్ణ, వైద్యాధికారులు సంతోష్, శ్రీనిధి, ప్రమీలారాణి పాల్గొన్నారు.

యాసంగికి విత్తనాలు సిద్ధం

- అందుబాటులోకి తీసుకొచ్చిన తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ
- మూడు రకాల వరితో పాటుపెసర, మినుము, శనగ, వేరుశనగ విత్తనాలు కూడా..
- పీఏసీఎస్‌లు, రైతుసేవా కేంద్రాల ద్వారా విక్రయానికి ఏర్పాట్లు



విత్తనాభివృద్ధి సంస్థ గోదాంలో నిల్వ చేసిన వరి విత్తనాల బ్యాగ్‌లు

ఖమ్మంవ్యవసాయం: ఈ ఏడాది భారీ వర్షాలతో జలాశయాల్లో సమృద్ధిగా నీరు చేరింది. దీంతో ఖరీఫ్ సీజన్ చివరి దశకు చేరగా.. రైతులు యాసంగి పంటల సాగుకు సిద్ధమవుతున్నారు. ఈనేపథ్యాన డిమాండ్‌కు అనుగుణంగా అవసరమైన విత్తనాలను అందుబాటులోకి తీసుకురావడంపై తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ దృష్టి సారించింది. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో యాసంగిలో సాగు చేయనున్న పంటలు, నేలల రకాలు, నీటి వనరుల ఆధారంగా విత్తనాలు సిద్ధం చేస్తున్నారు. రెండు జిల్లాల్లో ప్రధానంగా వరితో పాటు అపరాల పంటలైన పెసర, మినుము, శనగ, వేరుశనగ వంటి పంటలను సాగు చేసే అవకాశముంది. విత్తనాలను ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలు, ఆగ్రో రైతు సేవా కేంద్రాలు, డీలర్ల ద్వారా విక్రయించాలని నిర్ణయించారు.

వరిలో సన్నరకాలకే ప్రాధాన్యత

యాసంగి సీజన్‌కు అనుకూలమైన మూడు రకాల వరి విత్తనాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఎప్పుడైనా యాసంగిలో తక్కువ కాలం పంటలే సాగుచేస్తారు. రాష్ట్ర ప్రభుత్వం సన్న రకాల ధాన్యం క్వింటాకు రూ.500 బోనస్‌గా ప్రకటించింది. దీంతో రైతులు సన్న రకాల సాగుకే ప్రాధాన్యత ఇస్తారని తెలుస్తోంది. ఈ మేరకు తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ ఖమ్మం యూనిట్‌లో ఎంటీయూ–1010, కేఎస్ఎం–1638, ఆర్ఎన్ఆర్–15048 రకాలు సిద్ధం చేశారు. అంతేకాక జలాశయాల్లో సమృద్ధిగా నీరు ఉండటంతో ఉమ్మడి జిల్లా రైతాంగం బీపీటీ 5204(సాంబమసూరి), హెచ్ఎంటీ, జగిత్యాల సాంబ, వరంగల్ రకాలపైనా దృష్టి సారించినట్లు చెబుతున్నారు. ఫలితంగా ఈ రకాల విత్తనాలను కూడా జగిత్యాల, వనపర్తి, వరంగల్, నిజామాబాద్, కరీంనగర్ జిల్లాల నుంచి తెప్పించడంపై అధికారులు దృష్టి సారించారు.

అపరాలు, నూనె గింజలు..

యాసంగి సీజన్‌లో సాగు చేయనున్న అపరాల పంటలైన పెసర, మినుము, వేరుశనగ విత్తనాలను సైతం విత్తనాభివృద్ధి సంస్థ సిద్ధం చేస్తోంది. పెసరలో ఎంజీజీ–295, ఎంజీజీ–385, రకాలు మినుములో పీయూ–31, జీబీజీ–1, మంచి శనగలో జాకీ–9218, ఎన్‌బీఈజీ–49 రకాలు అందుబాటులోకి తీసుకురాగా, వేరుశనగలో గిరినార్–5, లేపాక్షి–కేఎల్–1812 రకాలు అందుబాటులోకి తీసుకొచ్చారు.

సబ్సిడీ లేకుండానే...

ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో సాగుకు అనుగుణంగా విత్తనాలను సమకూరుస్తున్న విత్తనాభివృద్ధి సంస్థ వీటిని పీఏసీఎస్‌లు, ఆగ్రో రైతు సేవా కేంద్రాల్లో విక్రయించనుంది. ఉమ్మడి జిల్లాలోని 100 సహకార సంఘాల్లో యాసంగి విత్తనాలను అందుబాటులో ఉంచాలని నిర్ణయించారు. అయితే, విత్తనాలపై సబ్సిడీ మాత్రం ప్రకటించలేదు.

రైతులు సద్వినియోగం చేసుకోవాలి



ఉమ్మడి జిల్లాలో యాసంగి పంటల సాగు అంచనాల మేరకు విత్తనాలు సమకూరుస్తున్నాం. విత్తనాలకు ఎలాంటి కొరత ఉండదు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న సామర్థ్యానికి మించి అవసరమైనా తెప్పిస్తాం. వరి, అపరాల పంటలైన పెసర, మినుము, వేరుశనగ తదితర పంటల విత్తనాలను ఇప్పటికే సిద్ధం చేశాం.

– ఎన్.బిక్షం, రీజినల్ మేనేజర్, విత్తనాభివృద్ధి సంస్థ ఖమ్మం యూనిట్

విత్తన రకాలు, ధరల వివరాలు

పంట	రకం	విత్తన లభ్యత (క్వింటాళ్లలో)	సంచి పరిమాణం (కిలోలు)	సంచి ధర (రూ.ల్లో)
పెసర	ఎంజీజీ-295	34.88	4	478.92
పెసర	ఎంజీజీ-385	23.52	4	478.92
మినుము	పీయూ-31	20.52	4	518.24
మినుము	జీబీజీ-1	13.36	4	518.24
శనగ	ఎన్‌బీఈజీ-49	00.25	25	2,250.00
శనగ	జాకీ-9218	00.25	25	2,250.00
వేరుశనగ	గిరినార్-5	79.50	30	3,046.50
వేరుశనగ	లేపాక్షి-1812	00.50	30	3,046.50
వరి	ఎంటీయూ-1010	66.50	25	995.00
వరి	కేఎస్ఎం-1638	85.75	25	1,005.00
వరి	ఆర్ఎన్ఆర్-15048	15.75	25	1,094.00

క్లుప్తంగా

జిన్నింగ్ మిల్లుల్లో ఆకస్మిక తనిఖీలు



ఎలక్ట్రానిక్ కాంటా తనిఖీ చేస్తున్న మనోహర్

బూర్గంపాడు: లక్ష్మీపురంలోని అనుశ్రీ ఇండస్ట్రీస్ కాటన్ జిన్నింగ్ మిల్లులో, నెల్లిపాకబంజరలోని శ్రీరామ కాటన్ ఇండస్ట్రీస్ జిన్నింగ్ మిల్లులో శుక్రవారం జిల్లా తూనికలు, కొలతల శాఖ అధికారి మనోహర్ ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. జిన్నింగ్ మిల్లుల్లోని వేబ్రిడ్జిలు, ఎలక్ట్రానిక్ కాంటాలు, తూకం రాళ్లను ఆయన పరిశీలించారు. కాంటాలకు సంబంధించిన అన్ని అనుమతి పత్రాలను పరిశీలించారు. వేబ్రిడ్జిలు, కాంటాలు, అనుమతి పత్రాలు అన్ని సక్రమంగా ఉన్నాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ అధికారి నరేందర్, మార్కెట్ కమిటీ కార్యదర్శి విజయనిర్మల తదితరులున్నారు.

నెల్లిపాకలో..

అశ్వాపురం: మండలంలోని నెల్లిపాక గ్రామంలో శ్రీరామ కాటన్ ఇండస్ట్రీస్ జిన్నింగ్ మిల్లులో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని జిల్లా తూనికల, కొలతల అధికారి మనోహర్ శుక్రవారం తనిఖీ చేశారు. వేబ్రిడ్జి కాటాను పరిశీలించారు.

ఎక్సైజ్ కార్యాలయం ఎదుట ధర్నా



ధర్నా చేస్తున్న సేవాలాల్ సేన నాయకులు

ఇల్లెందురూరల్: మండలంలోని ఎక్సైజ్ కార్యాలయం వద్ద సేవాలాల్ సేన ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా చేశారు. ఎక్సైజ్ సీఐ రాంప్రసాద్‌కు వినతిపత్రాన్ని అందజేశాక సంఘం జిల్లా అధ్యక్షుడు ధరావత్ సురేశ్‌నాయక్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రవిరాథోడ్ మాట్లాడారు. ఇల్లెందు ఎక్సైజ్ కార్యాలయం పరిధిలోని మండలాల్లో మద్యం విక్రయాలు నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్నాయని, వైన్స్‌లలో అధిక ధరలకు మద్యం విక్రయిస్తున్నారని ఆరోపించారు. వైన్స్‌లలో లభించని బ్రాండ్లు బెల్టు దుకాణాల్లో విక్రయిస్తున్నారని, ఫలితంగా మద్యం ప్రియులు అధిక ధరలు వెచ్చించి కొనుగోలు చేయాల్సి వస్తోందన్నారు. కార్యక్రమంలో నాయకులు భూక్య శ్రీనునాయక్, వాంకుడోత్ రమేశ్, జర్పుల మంగీలాల్, బోడ రమేశ్, వెంకటేశ్, లాలునాయక్, బానోత్ కిషన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుప్రమాదంలో ఏఓకు గాయాలు

దుమ్ముగూడెం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఎటపాక వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మండల వ్యవసాయాధికారి నవీన్‌కుమార్ గాయపడ్డారు. నవీన్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి మాధవి, ఏఈఓ హసీనా విధులు ముగించుకుని ఆటోలో భద్రాచలం వెళ్తుండగా ఎటపాక వద్ద కుక్క అడ్డు రావడంతో ఆటో బోల్తాపడింది. ఈ ఘటనలో నవీన్‌కుమార్, మాధవి, హసీనా గాయపడ్డారు. అటువైపు వెళ్తున్న ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు స్పందించి క్షతగాత్రులను తన వాహనంలో వైద్యశాలకు తరలించారు. పంచాయతీ కార్యదర్శి మాధవిని మారాయిగూడెం పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు తన కారులో భద్రాచలం వైద్యశాలకు తరలించారు.

వైఎస్సార్‌సీపీ జిల్లా మాజీ అధ్యక్షుడిపై ఏపీలో కేసు

భద్రాచలంఅర్బన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా మాజీ అధ్యక్షుడు కొల్లు వెంకటరెడ్డిపై విజయవాడ సైబర్ క్రైం పోలీసులు కేసు నమోదు చేశారు. ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేశ్‌పై సోషల్ మీడియాలో అనుచిత వ్యాఖ్యలతో పోస్టులు పెట్టారంటూ బద్దం అశోక్‌రెడ్డి చేసిన ఫిర్యాదుతో ఈ కేసు నమోదైంది. అయితే, పోస్టులతో తనకు సంబంధం లేదని, ఏపీ పోలీసులు కావాలనే ఇబ్బంది పెడుతున్నారని వెంకటరెడ్డి వాపోయారు. అనారోగ్యంతో బాధపడుతున్న తాను 14 నెలలుగా హైదరాబాద్‌లో ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నానని తెలిపారు.

లారీడ్రైవర్‌కు జైలు శిక్ష

కొత్తగూడెంటౌన్: అతి వేగంగా, అజాగ్రత్తగా లారీని నడిపి ముగ్గురు వ్యక్తుల మరణానికి కారణమైన లారీడ్రైవర్ బాదావత్ కోటేశ్వరరావుకు రెండేళ్ల జైలుశిక్షతో పాటు రూ.5 వేలు జరిమానా విధిస్తూ శుక్రవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ తీర్పు చెప్పారు. 2019, జనవరి 31న ఖమ్మం జిల్లా రఘునాథపాలెంనకు చెందిన బాదావత్ కోటేశ్వరరావు.. లారీని అజాగ్రత్తగా, అతివేగంగా నడుపుతూ అశ్వాపురం పీఎస్ పరిధిలోని మొండికుంట సమీపంలో ద్విచక్రవాహనంపై వెళ్తున్న పశ్చిమ గోదావరి జిల్లా ఉంగుటూరు గ్రామం కొత్తగూడెంనకు చెందిన రాయి పాసి రాజుల, పులిచర్ల సత్యనారాయణ, మేకల వెంకటరావును ఢీకొట్టాడు. దీంతో ఆ ముగ్గురు వ్యక్తులు అక్కడికక్కడే మృతిచెందారు. అదే రోజు అశ్వాపురం పీఎస్‌లో కేసు నమోదు చేసిన పోలీసులు తర్వాత కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. న్యాయమూర్తి 8 మంది సాక్షులను విచారించి, లారీడ్రైవర్ బాదావత్ కోటేశ్వరరావుపై నేరం రుజువు కావడంతో రెండేళ్ల జైలుశిక్షతో పాటు రూ.5 వేల జరిమానా విధిస్తూ జిల్లా జడ్జి పాటిల్ వసంత్ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున పీపీడీ లక్ష్మి వ్యవహరించారు.

భద్రాద్రి కీర్తిని రాష్ట్రస్థాయిలో నిలిపారు..

భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, పీఓ బి.రాహుల్



బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే వెంకట్రావు, పీఓ రాహుల్

భద్రాచలంటౌన్: అదిలాబాద్ జిల్లా ఉట్నూర్‌లో మూడు రోజుల పాటు జరిగిన రాష్ట్రస్థాయి గిరిజన క్రీడోత్సవాల్లో భద్రాచలం ఐటీడీఏ పరిధి క్రీడాకారులు అన్ని విభాగాల్లో సత్తా చాటి ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించడం అభినందనీయమని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, ఐటీడీఏ పీఓ బి.రాహుల్ అన్నారు. ఉట్నూరులో ఇటీవల జరిగిన రాష్ట్రస్థాయి గిరిజన క్రీడల్లో ఐటీడీఏ పరిధి పాఠశాలల విద్యార్థులు విజేతలుగా నిలవగా శుక్రవారం ఐటీడీఏ కార్యాలయంలో వారిని అభినందించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుకుంటూనే క్రీడల్లో తర్ఫీదు పొందడం ద్వారా మంచి ఫలితాలు వస్తాయన్నారు. పీఓ రాహుల్ మాట్లాడుతూ.. భద్రాచలం ఐటీడీఏ జోన్ నుంచి 248 మంది క్రీడాకారులు, 28 మంది పీడీ, పీఈటీ, కోచ్‌లు రాష్ట్ర స్థాయి పోటీలకు హాజరు కాగా అన్ని విభాగాల్లో సత్తా చాటి ట్రోఫీ కైవసం చేసుకోవడం అభినందనీయమన్నారు. అనంతరం విద్యార్థులకు పతకాలు అందజేశారు. కార్యక్రమంలో డీడీ మణెమ్మ, స్పోర్ట్స్ ఆఫీసర్ గోపాల్‌రావు, అసిస్టెంట్ స్పోర్ట్స్ ఆఫీసర్ వెంకటనారాయణ, పీడీలు, పీఈటీలు ఎస్.రామారావు, వెంకన్న వెంకటేశ్వర్లు, గోపాల్‌రావు, హరికృష్ణ, మోతీలాల్, రవి, సతీశ్, జానకి, హైమావతి, రామారావు, వీరన్న, సుస్మితబాయి, అంజయ్య, వెంకటేశ్వర్లు, మహాలక్ష్మి, మారెప్ప, నాగరాజు, వాసు, ప్రసాద్, సందీప్, మండల్ సింగ్, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు



మాట్లాడుతున్న రేగా కాంతారావు

జూలూరుపాడు: కాంగ్రెస్ ఎన్నికల హామీలను నెరవేర్చడంలో విఫలమైందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు ఆరోపించారు. మండల కేంద్రంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ఎండగడుతామని, తద్వారా స్థానిక సంస్థలతోపాటు ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం సాధించడం ఖాయమన్నారు. ఎన్నికలకు ముందు ప్రకటించిన ఆరు గ్యారంటీల్లో రూ.2 లక్షల రుణమాఫీ, రైతు భరోసా, కల్యాణలక్ష్మి ద్వారా తులం బంగారం, విద్యార్థినులకు స్కూటీలు ఇలా ఏ హామీని అమలుచేయలేదని ఆరోపించారు. కాగా, జిల్లావ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్లలో సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వంపై ఫిర్యాదు చేస్తామని చెప్పారు. కాంగ్రెస్ ప్రజావ్యతిరేక విధానాలను ప్రశ్నిస్తున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై తప్పుడు కేసులు పెట్టడం సరికాదని పేర్కొన్నారు. సీతారామ ప్రాజెక్టును రీడిజైన్ పేరుతో కాలయాపన చేస్తున్నారని, నిధులు ఆదా చేస్తామని చెప్పి ఏన్కూరు లింక్ కెనాల్ నిర్మాణం చేపట్టారని ఆరోపించారు. తద్వారా జిల్లా రైతులకు సీతారామ జలాలు ఇవ్వకుండా ఇతర ప్రాంతాలకు తరలించడం సరికాదని కాంతారావు తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి ముగ్గురు మంత్రులు ఉన్నా ఎలాంటి అభివృద్ధి జరగడం లేదన్నారు. సమావేశంలో లకావత్ గిరిబాబు, చావా వెంకటరామారావు, సాయిల నాగేశ్వరరావు, చాపలమడుగు రామ్మూర్తి, బోడా భోజ్యానాయక్, తాళ్లూరి రామారావు, మోదుగు నరసింహారావు, మద్దిన్ని అభి, కిరణ్ చౌదరి, బుడిపూడి ప్రభాకర్, పోతురాజు రామారావు తదితరులు పాల్గొన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శనను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న డీఈఓ వెంకటేశ్వరాచారి

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఈ నెల 18, 19, 20 తేదీల్లో జరిగే జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శన, డిసెంబర్ 4వ తేదీన జరిగే జాతీయ సాధన సర్వేలను విజయవంతం చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి వెంకటేశ్వరాచారి పిలుపునిచ్చారు. జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలలు, రెసిడెన్షియల్ పాఠశాలల హెచ్‌ఎంతో జిల్లా విద్యా శిక్షణ కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా డిసెంబర్ 4న నిర్వహించే జాతీయ సాధన సర్వేలో అన్ని పాఠశాలలు పాల్గొనాలని, ఈ సర్వే 3, 6, 9 తరగతుల విద్యార్థులకు నిర్వహిస్తారన్నారు. కాగా, ఈ సర్వే ప్రక్రియ, ప్రశ్నల స్వభావం, పాఠశాలల్లో సర్వే కోసం చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి జిల్లా అకడమిక్ మానిటరింగ్ అధికారి నాగరాజశేఖర్ వివరించారు. ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకు అన్నపురెడ్డిపల్లిలో జరిగే జిల్లా వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రాజెక్టుల గురించి జిల్లా సైన్స్ అధికారి ఎస్.చలపతిరాజు వివరించారు. ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ ఎస్.మాధవరావు మాట్లాడుతూ పదో తరగతి నామినల్ రోల్స్ నింపడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు.

పెళ్లి ఇంట్లో చోరీ

కొత్తగూడెంటౌన్: పెళ్లి మండపానికి కుటుంబ సభ్యులంతా వెళ్లడంతో పెళ్లి కూతురు ఇంట్లో దొంగలు పడి బంగారం, నగదు, పట్టు చీరలు ఎత్తుకెళ్లిన ఘటన శుక్రవారం రాత్రి కొత్తగూడెం వన్‌టౌన్ పరిధిలో చోటుచేసుకుంది. బాధితుల కథనం ప్రకారం.. కొత్తగూడెం రైల్వేలో కార్మికురాలిగా పనిచేస్తున్న ఉప్పులేటి లక్ష్మీ కుమార్తె పెళ్లి గౌతంపూర్‌కాలనీలో ఉండటంతో కుటుంబ సభ్యులు, బంధువులంతా అక్కడికి వెళ్లారు. ఈ క్రమంలో రైల్వే క్వార్టర్లలో ఉన్న లక్ష్మి ఇంట్లోకి గుర్తుతెలియని దుండగులు ప్రవేశించి బీరువాలోని రూ.90 వేలు, ఐదు ఉంగరాలు, పట్టుచీరలు చోరీ చేశారు. ఇంటికి వచ్చినవారు గమనించి, పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

రేపు సుఖధం భవన్ ప్రారంభం

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణం సీతారామనగర్‌కాలనీలోని బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో నిర్మించిన సుఖధం భవన్‌ను ఈ నెల 10న ప్రారంభిస్తున్నట్లు బ్రహ్మకుమారి కృష్ణవేణి తెలిపా రు. నూతన భవనంలో శుక్రవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆమె వివరాలు వెల్లడించారు. 35 ఏళ్లుగా బ్రహ్మకుమారీస్ పట్టణంలో ఆధ్యాత్మిక సేవలు అందిస్తున్నారని, సేవల విస్తరణకు విశాలమైన భవనం నిర్మించామన్నారు. ప్రారంభోత్సవానికి బ్రహ్మకుమారీస్ జాయింట్ చీఫ్ బీకే రాజయోగిని సంతోష్ దీదీ, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొంటారని, 10న ఆర్యవైశ్య కల్యాణ మండపం నుంచి శాంతియాత్ర, శోభాయాత్ర ఉంటుందని, అనంతరం సంతోషి దీదీ ప్రవచనం ఉంటుందని వివరించారు.

దోపీడీని అరికట్టేందుకే విప్లవ పోరాటాలు

అమరవీరుల సంస్మరణ సభలో నేతలు



మాట్లాడుతున్న సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ కేంద్ర కమిటీ సభ్యులు కిచ్చెల రంగయ్య

ఇల్లెందు: భూమి, భుక్తి, విముక్తితో పాటు సమసమాజ స్థాపన కోసం ప్రాణాలను అర్పించిన ధీరుల త్యాగాలు వృథా కాకుండా వారి ఆశయ సాధనకు అంతా పోరాడాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ కేంద్ర కమిటీ సభ్యుడు కిచ్చెల రంగయ్య పిలుపునిచ్చారు. ఇల్లెందులోని చంద్ర కృష్ణమూర్తి విజ్ఞాన కేంద్రం(ఎల్లన్న భవన్) వద్ద మాస్‌లైన్ ఆధ్వర్యాన శుక్రవారం నిర్వహించిన అమరవీరుల సంస్మరణ సభలో ఆయన మాట్లాడారు. విప్లవోద్యమ చరిత్రలో అనేక మంది తమ రక్తంతో ఎర్రజెండాను మరింత ఎరుపెక్కించారన్నారు. మాస్‌లైన్ రాష్ట్ర నాయకుడు చిన్న చంద్రన్న మాట్లాడుతూ 1967 నుంచి నేటి వరకు వేలాది మంది తమ రక్తతర్పణతో పార్టీని నిలబెట్టారని తెలిపారు. మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి ముద్దా భిక్షం మాట్లాడుతూ గోదావరి పరీవాహక ప్రాంతంలో కూలీ రేట్లు, తునికాకు సమస్య, పోడుభూముల కోసం పలువురు అసువులుబాసారన్నారు. మాస్‌లైన్ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, పీఓడబ్ల్యూ రాష్ట్ర నాయకులు చంద్ర అరుణ మాట్లాడగా నాయకులు నాయిని రాజు, జగ్గన్న, మాచర్ల సత్యం, బోసు, బుర్ర వెంకన్న, యదళ్లపల్లి సావిత్రి, యాకుబ్‌షావలీ, కాంపాటి పృథ్వీ, అజ్మీర బిచ్చా తదితరులు పాల్గొన్నారు. తొలుత అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించగా అరుణోదయ కళాకారుల ఆటాపాట ఆకట్టుకున్నాయి.


హోరాహోరీగా జెన్‌కో క్రీడలు



కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

పాల్వంచ: రెండు రోజులుగా స్థానిక విద్యుత్ కళాభారతి క్రీడామైదానంలో జరుగుతున్న జెన్‌కో ఇంటర్ ప్రాజెక్ట్స్ కబడ్డీ, ఫుట్‌బాల్ క్రీడా పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. గురువారం కబడ్డీ పోటీల్లో బీటీపీఎస్, వైటీపీఎస్‌లో జరిగిన పోటీల్లో బీటీపీఎస్, ఫుట్‌బాల్‌లో కేటీపీఎస్ 7వ దశ, శ్రీశైలం పోటీపడగా కేటీపీఎస్ 7వ దశ, బీటీపీఎస్, విద్యుత్ సౌధ తలపడగా బీటీపీఎస్ గెలుపొందింది. శుక్రవారం ఫుట్‌బాల్‌లో కేటీపీపీ, కేటీపీఎస్ 5, 6 దశలు పోటీపడగా కేటీపీఎస్ 5, 6 దశలు, కబడ్డీలో కేటీపీపీ, కేటీపీఎస్ 5, 6 దశలు తలపడగా కేటీపీఎస్ 5, 6 దశలు గెలుపొంది, ఫైనల్స్‌కు చేరాయి. ఈ పోటీల్లో జెన్‌కో స్పోర్ట్స్ ఆఫీసర్ లోహిత్ ఆనంద్, కేటీపీఎస్ 5, 6, 7 దశల సెక్రటరీలు వీరస్వామి, మహేశ్, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ ఢీకొని ఒకరు మృతి



గంగరాజు (ఫైల్)

అశ్వారావుపేటరూరల్: ట్రాక్టర్ ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన శుక్రవారం మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు, ఎస్‌ఐ శివరామకృష్ణ కథనం ప్రకారం.. రామన్నగూడేనికి చెందిన నారం గంగరాజు (56) పొలం పనులు ముగించుకుని మోపెడ్‌పై తిరిగి ఇంటికి వస్తున్నాడు. మార్గమధ్యలో వేగంగా వచ్చిన ట్రాక్టర్ అదుపుతప్పి ఢీకొట్టడంతో గంగరాజు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు ఆయన్ను అశ్వారావుపేట ఆస్పత్రికి.. అక్కడి నుంచి ఖమ్మం తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. మృతుడి కుమార్తె కుంజా స్వరూప ఫిర్యాదు మేరకు ట్రాక్టర్ డ్రైవర్ఆకుల శ్రీనుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడి భార్య గతంలోనే మృతి చెందగా, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కాగా, రెండు రోజులుగా అశ్వారావుపేటకు చెందిన కొందరు వ్యక్తులు అనుమతులు లేకుండానే రామన్నగూడెం సమీపం నుంచి దుబ్బ ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. ఈ దుబ్బ ఇసుక తరలిస్తున్న ఓ ట్రాక్టర్, ఎదురుగా వస్తున్న మరో ట్రాక్టర్‌ను తప్పించే క్రమంలో అదుపుతప్పి గంగరాజును ఢీకొట్టింది.

చికిత్స పొందుతున్న యువకుడు...

జూలూరుపాడు: ప్రేమించిన అమ్మాయితో పెళ్లి చేస్తారో లేదోననే బెంగతో ఓ యువకుడు పురుగులమందు తాగి.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు శుక్రవారం కేసు నమోదుచేశారు. ఎస్‌హెచ్‌ఓ మల్లయ్య కథనం ప్రకారం.. మండలంలోని కాకర్లకు చెందిన గుంటి కోటేశ్వరరావు (22) అనంతారం గ్రామానికి చెందిన బాలికతో ప్రేమలో పడ్డాడు. విషయాన్ని బాలిక తల్లిదండ్రులకు కోటేశ్వరరావు తెలపగా.. కొంత సమయం తరువాత పెళ్లి చేస్తామని చెప్పారు. తర్వాత ఆ అమ్మాయితో పెళ్లిచేస్తారో లేదోనని, ఈ నెల 6న రాత్రి పాలగుట్ట సమీపంలో పురుగుమందు తాగాడు. కుటుంబ సభ్యులు కోటేశ్వరరావును కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. మృతుడి సోదరుడు రవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌ఓ మల్లయ్య పేర్కొన్నారు.

ట్రాలీ బోల్తా.. డ్రైవర్ మృతి

దమ్మపేట: ట్రాలీ ఆటో బోల్తాపడి డ్రైవర్ మృతి చెందిన ఘటన మండలంలోని పార్కలగండి గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండలంలోని లచ్చాపురం గ్రామానికి చెందిన ట్రాలీ ఆటోడ్రైవర్ కలపాల కామేశ్ (55).. తన ఆటోలో మరో వ్యక్తిని ఎక్కించుకుని పాల్వంచ వైపు వెళ్తున్నాడు. పార్కలగండి పరిధిలోకి చేరుకోగా అదుపుతప్పి రోడ్డుపై బోల్తాపడింది. తీవ్రంగా గాయపడిన కామేశ్, మరో వ్యక్తిని స్థానికులు దమ్మపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు కామేశ్ మృతి చెందాడని తెలిపారు. మృతుడి కుమారుడు భాస్కరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ సాయికిశోర్‌రెడ్డి తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ...

పాల్వంచ: అనుమానాదాస్పద స్థితిలో మహిళ మృతి చెందింది. పోలీసుల కథనం మేరకు.. పట్టణంలోని ప్రశాంత్‌నగర్ కాలనీకి చెందిన బోణాల రాణి (40) భర్తతో విడిపోయి.. బొల్లేరుగూడెంనకు చెందిన రాంబాబుతో సహజీవనం చేస్తోంది. శుక్రవారం ఇంట్లో కిందపడి అపస్మారక స్థితిలో ఉండటంతో స్థానికులు గమనించి రాంబాబుకు సమాచారం అందించారు. అనంతరం ఆమెను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందిందని వైద్య సిబ్బంది తెలిపారు. రాణి తల్లి నూనావత్ సాలి ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ సుమన్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

కోడి పందేల స్థావరంపై దాడి

అశ్వారావుపేటరూరల్: కోడి పందేలు నిర్వహిస్తున్న స్థావరంపై శుక్రవారం పోలీసులు దాడి చేశారు. ఎస్‌ఐ శివరామకృష్ణ కథనం ప్రకారం.. మండలంలోని తిరుమలకుంట కాలనీ గ్రామ సమీపంలో గల అటవీ ప్రాంతంలో కొంతమంది వ్యక్తులు కోడి పందేలు నిర్వహిస్తున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి దాడి చేశారు. ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.7,600 నగదుతోపాటు నాలుగు పందెం కోడి పుంజులు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

శ్రమ దోపిడీకి గురవుతున్న కార్మికులు

అశ్వారావుపేటరూరల్: కార్మికుల శ్రమను కాంట్రాక్టర్లు దోపిడీ చేస్తున్నారని, అయినా సరే ప్రభుత్వ అధికారులకు పట్టడం లేదని తెలంగాణ యూనివర్సిటీ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ఎం.పద్మశ్రీ అన్నారు. శుక్రవారం స్థానిక వ్యవసాయ కళాశాలలో అమీర్ అధ్యక్షతన కార్మికులతో సమావేశం నిర్వహించగా ఆమె మాట్లాడారు. రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల్లో పనిచేస్తున్న టైంస్కేల్, డైలీ వేజ్, ఎన్ఎంఆర్ కాంటింజెంట్, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, నాన్ టీచింగ్ సిబ్బందిని క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బ్రహ్మాచారి, పిట్టల అర్జున్, రమేశ్, సాలార్, తిరుపతి, రమణ, షాకీర్, ఆశ, అనిత పాల్గొన్నారు.

టేకు కలప స్వాధీనం

కరకగూడెం: అనుమతి లేని టేకు కలపను స్వాధీనం చేసుకున్న ఫారెస్ట్ అధికారులు ఓ వ్యక్తిపై కేసు నమోదు చేశారు. అనంతారం ఎఫ్ఎస్ఓ గోవింద్ కథనం ప్రకారం.. అనంతారం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఇంట్లో శుక్రవారం తనిఖీలు చేయగా ఎలాంటి అనుమతులు లేకుండా కలపను నిల్వ ఉంచగా దానిని స్వాధీనం చేసుకొని సదరు వ్యక్తిపై కేస్ నమోదుచేసి, రూ.లక్ష జరిమానా విధించామని తెలిపారు. ఎఫ్‌బీఓలు రోజా, లక్ష్మీనర్సు, బేస్ క్యాంపు సిబ్బంది రాంబాబు, సాంబ, గణేశ్ పాల్గొన్నారు.

రాగి తీగ చోరీ

సుజాతనగర్: విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పగలగొట్టి అందులోని రాగి తీగను చోరీ చేసిన ఘటన సర్వారంలో శుక్రవారం వెలుగుచూసింది. ఏఈ కిషన్ కథనం ప్రకారం.. సర్వారం పరిధిలో వ్యవసాయ అవసరాల నిమిత్తం 25 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. శుక్రవారం ఓ రైతు పొలంలోని మోటారు ఆన్ చేయగా విద్యుత్ సరఫరా కాలేదు. దీంతో అనుమానం వచ్చి ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వచ్చి చూడగా.. ట్రాన్స్‌ఫార్మర్ పగలగొట్టి ఉండటంతో విద్యుత్ అధికారులకు సమాచారం ఇచ్చాడు. ట్రాన్స్‌ఫార్మర్ పగలగొట్టి అందులోని రాగి తీగను ఎత్తుకెళ్లినట్లు ఏఈ కిషన్ తెలిపారు. చోరీకి గురైన రాగి తీగ, ఇతర వస్తువుల విలువ రూ.95 వేల వరకు ఉంటుందని, ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు ఆయన తెలిపారు.

పురుగుమందుల దుకాణంలో...

జూలూరుపాడు: మండల కేంద్రంలోని అరుణ సాయి ట్రేడర్స్ దుకాణంలోకి గురువారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి చోరీకి పాల్పడ్డారు. శుక్రవారం ఉదయం దుకాణాన్ని తెరిచేందుకు వచ్చిన యజమాని అన్వేశ్ సీసీ కెమెరా వైర్ తెగి ఉండటాన్ని గమనించి, లోపల పరిశీలించగా విలువైన పురుగుమందుల డబ్బాలు ఉన్న ఐదు బాక్స్‌లు కనిపించలేదు. సీసీ ఫుటేజీలను పరిశీలించగా గురువారం రాత్రి 11.42గంటల నుంచి సీసీ కెమెరా ఆఫ్ చేసి ఉండగా.. 12.12గంటల నుంచి ఆన్ చేసి ఉంది. పురుగుమందుల విలువ సుమారు రూ.2లక్షల వరకు ఉంటుందని యజమాని పేర్కొన్నాడు. యజమాని ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేపట్టారు.

డీజీపీని కలిసిన ఈడీ అధికారులు

సాక్షి, హైదరాబాద్: డీజీపీ జితేందర్‌ను శుక్రవారం సాయంత్రం కొందరు ఈడీ అధికారులు కలిసినట్టు సమాచారం. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం నాగారంలోని భూదాన్ భూముల కుంభకోణానికి సంబంధించి ఇప్పటికే ఐఏఎస్ అధికారి, రంగారెడ్డిజిల్లా మాజీ కలెక్టర్ అమోయ్‌కుమార్‌ను ఈడీ అధికారులు గత నెలలో 3 రోజులపాటు ప్రశ్నించిన విషయం తెలిసిందే. అంతకుముందు మహేశ్వరం తహసీల్దార్ జ్యోతి స్టేట్‌మెంట్లను ఈడీ అధికారులు నమోదు చేశారు. ఈ ఇద్దరు అధి కారుల విచారణ సందర్భంగా సేకరించిన సమాచారం ఆధారంగా మాజీ ఆర్డీఓ వెంకటా చారినీ ఈడీ అధికారులు రెండు రోజుల క్రితం సుదీ ర్ఘంగా ప్రశ్నించారు. ఈ కేసులో కీలక సమాచా రం సేకరిస్తున్న నేపథ్యంలో ఈడీ అధికారులు డీజీపీని కలవడం ప్రాధా న్యం సంతరించుకుంది. అమోయ్‌కుమార్‌పై వచ్చిన ఆరోపణలపై డీజీపీని కలిసి ఈడీ అధికారులు చర్చించారు. మనీ లాండరింగ్ చట్టం కింద కేసు నమోదు చేసేందుకు స్థానిక పోలీసుల సహకారం కావాలని డీజీపీని ఈడీ అధికారులు కోరారు. భూదాన్ భూముల వ్యవహారంలో పోలీసులకు లేఖ రాసినా, ఇప్పటి వరకు ఎలాంటి వివరాలివ్వ లేదని డీజీపీకి ఈడీ అధికారులు తెలిపా రు. శంకరాహిల్స్ సొసైటీ, బాలసాయిబాబా ట్రస్ట్ భూములు, రాయదుర్గంలోని కొన్ని భూముల వ్యవహారంలో ఇన్వెస్టిగేషన్ జరిపించాలని డీజీపీని ఈడీ అధికారులు కోరినట్టు సమాచారం.

ఖాకీలపై ఆగ్రహం..

ఈనెల 4 నుంచి సంబంధిత పోలీస్ స్టేషన్లలోని సీసీ ఫుటేజీని స్థానిక మెజిస్ట్రేట్లకు సీల్డ్ కవర్లలో అందజేయండి

సోషల్ మీడియా యాక్టివిస్టుల అరెస్టులపై ఏపీ హైకోర్టు ఆదేశం

సాక్షి అమరావతి: రాష్ట్రవ్యాప్తంగా కొద్ది రోజులుగా యథేచ్ఛగా జరుగుతున్న సోషల్ మీడియా కార్యకర్తల అరెస్టులు, అక్రమ నిర్బంధాలపై హైకోర్టు తీవ్రంగా స్పందించింది. అక్రమ నిర్బంధాల విషయంలో పోలీసుల తీరుపై పలు సందేహాలు వ్యక్తం చేసింది. ఇద్దరు సోషల్ మీడియా కార్యకర్తల అక్ర మ నిర్బంధానికి సంబంధించి రెండు పోలీస్ స్టేష న్లలో సీసీ టీవీ ఫుటేజీలను సంబంధిత మేజిస్ట్రేట్ల ఎదుట సీల్డ్ కవర్లలో అందచేయాలని పోలీసులకు కీలక ఆదేశాలు జారీ చేసింది. వ్యక్తుల అరెస్ట్ విష యంలో చట్ట నిబంధనలు పాటించి తీరాల్సిందేనని పోలీసులకు తేల్చి చెప్పింది. లేని పక్షంలో తాము జోక్యం చేసుకో వాల్సి ఉంటుందని, ఆ పరిస్థితి తేవద్దని హెచ్చరించింది. ఇది వ్యక్తుల స్వేచ్ఛతో ముడి పడి ఉందని, కాబట్టి ఈ విషయాన్ని తేలికగా తీసుకోవద్దని తేల్చి చెప్పింది. చట్ట నిబంధనలు పాటించేలా పోలీసులను చైతన్య పరచాలని రాష్ట్ర ప్రభుత్వానికి స్పష్టం చేసింది. విశాఖకు చెందిన సోషల్ మీడియా కార్యకర్త తిరుపతి లోకేష్‌ను సోమవారం తమ ముందు హాజరు పరచాలని పోలీసులను ఆదేశించింది. వ్యక్తులను పోలీసులు అక్రమంగా నిర్బంధించారంటూ హైకోర్టులో పిటిషన్లు దాఖలు కావడం ఎక్కువ అయిందని ఈ సందర్భంగా వ్యాఖ్యానించింది. దీనిపై తదుపరి విచారణను సోమవారానికి వాయిదా వేస్తూ న్యాయమూర్తులు జస్టిస్ రావు రఘునందన్‌రావు, జస్టిస్ కుంచం మహేశ్వరరావు ధర్మాసనం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది.

కోర్టును ఆశ్రయించిన బాధిత కుటుంబాలు

టీడీపీ కూటమి ప్రభుత్వాన్ని సోషల్ మీడియాలో విమర్శిస్తున్నారంటూ పలువురిని పోలీసులు అక్రమంగా నిర్బంధంలోకి తీసుకుంటున్న విషయం తెలిసిందే. గత వారం రోజుల్లో 101 మందిని అక్రమంగా అరెస్టులు చేశారు. తమవారిని పోలీసులు కోర్టు ముందు హాజరు పర్చకుండా అక్రమ నిర్బంధంలో ఉంచడంపై బాధిత కుటుంబాలకు చెందిన పలువురు హైకోర్టును ఆశ్రయించారు. అక్రమంగా నిర్బంధించిన తమ కుటుంబ సభ్యులను న్యాయస్థానం ఎదుట హాజరు పరిచేలా ఆదేశించాలంటూ హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్లు దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలపై జస్టిస్ రఘునందన్‌రావు ధర్మాసనం తాజాగా విచారణ జరిపింది.

పౌరుల స్వేచ్ఛను కాపాడతాం..

విచారణ సందర్భంగా తిరుపతి లోకేష్ తరఫు న్యాయవాది చింతల సుమన్ వాదనలు వినిపిస్తూ.. వైఎస్సార్ కుటుంబం పేరుతో వాట్సాప్ గ్రూప్‌లో ఉన్న 411 మందికి నోటీసులు ఇచ్చారని నివేదించారు. వారిలో 120 మంది విజయవాడ సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో హాజరయ్యారని తెలిపారు. తిరుపతి లోకేష్‌ను సైబర్ క్రైమ్ పోలీసులు ఈ నెల 5న విశాఖ నుంచి విజయవాడ తరలించారన్నారు. లోకేష్ సోదరుడిని పిలిపించి తెల్ల కాగి తాలపై సంతకాలు చేయాలని ఒత్తిడి చేస్తున్నారని ధర్మాసనానికి నివేదించారు. ప్రస్తుతం లోకేష్ జాడ తెలియడం లేదన్నారు. ఈ సమయంలో కోర్టులో ఉన్న విజయవాడ సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ జానకి రామయ్యతో ధర్మాసనం నేరుగా మాట్లాడింది. తిరుపతి లోకేష్ సోషల్ మీడియా ద్వారా ఓ గ్రూప్ నిర్వహిస్తూ అసభ్యకర పోస్టులు పెడుతున్నారని ఆయన కోర్టుకు చెప్పారు. దీనిపై ఫిర్యాదు అందడంతో కేసు నమోదు చేశామన్నారు. ఫోన్ చేయడంతో తన బావతో కలిసి లోకేష్ పోలీస్ స్టేషన్‌కు వచ్చారన్నారు. లోకేష్‌ని విచారించిన అనంతరం నోటీసులు ఇచ్చి పంపామన్నారు. నేరానికి సంబంధించిన ఎలక్ట్రానిక్ పరికరాలతో ఈ నెల 10న హాజరు కావాలని ఆయనకు సూచించినట్లు చెప్పారు. జానకి రామయ్య చెప్పిన వివరాలను రికార్డు చేసిన ధర్మాసనం.. సోమవారం ఉదయం 10:30 గంటలకు లోకేష్‌ను తమ ముందు హాజరుపరచాలని పోలీసులను ఆదేశించింది. ఈ నెల 4వతేదీ నుంచి 8వ తేదీ వరకు సీసీ టీవీ ఫుటేజీని భద్రపరచి సీల్డ్ కవర్‌లో విజయవాడ మెజిస్ట్రేట్‌కు సమర్పించాలని ఆదేశించింది. అరెస్ట్ చేసిన 24 గంటలలోపు నిందితులను మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచాలని స్పష్టం చేసింది. చట్ట నిబంధనలను పాటించి తీరాలని లేదంటే తమ జోక్యం తప్పదని తేల్చిచెప్పింది. పౌరుల స్వేచ్ఛను కాపాడటం ఈ కోర్టు బాధ్యత అని స్పష్టం చేసింది. అంతకు ముందు పోలీసుల తరఫున అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు విని పిస్తూ సోషల్ మీడియా ద్వారా కొందరు ఉద్దేశ పూర్వకంగా తప్పుడు ప్రచారం, అసభ్య వ్యాఖ్యలు చేస్తున్నారని నివేదించారు. ఇలాంటి వారికి నోటీసులు ఇవ్వాల్సిన అవసరం లేదని పేర్కొనగా, దీనిపై ధర్మాసనం స్పందిస్తూ చట్ట నిబంధనలను పాటించాల్సిందేనని స్పష్టం చేసింది.

టేకులపల్లి స్టేషన్ ఫుటేజీ కూడా..

అనంతపురం జిల్లా ముదిగుబ్బ మండలం ఆత్మకూరుకు చెందిన జింకల నాగరాజు అక్రమ నిర్బంధంపై దాఖలైన పిటిషన్లపై విచారణను హైకోర్టు సోమవారానికి వాయిదా వేసింది. పూర్తి వివరా లతో కౌంటర్ దాఖలు చేయాలని పోలీసులను ఆదేశించింది. టేకులపల్లి స్టేషన్‌లోని సీసీ టీవీ ఫుటేజీని భద్రపరచి సంబంధిత మేజిస్ట్రేట్ ముందు ఉంచాలని పోలీసులను ఆదేశించింది.

సోషల్ మీడియా యాక్టివిస్టులకు అండగా నిలుస్తా

వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

సాక్షి, అమరావతి: ప్రజాస్వామ్య సూత్రాలను, మానవహక్కులను కాలరాసి మరీ సోషల్ మీడియా యాక్టివిస్టులను భయకంపితులను చేస్తున్న, దారుణంగా హింసిస్తున్న అత్యంత క్రూరమైన ప్రభుత్వంతో పోరాడుతున్నామని, ఈ యుద్ధంలో కచ్చితంగా న్యాయమే గెలుస్తుందని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టం చేశారు. 'ఈ అనైతిక యుద్ధంలో సోషల్ మీడియా యాక్టివిస్టులపై నిత్యం అక్రమ కేసులు, వేధింపులు, నిర్బంధాలు జరుగుతూనే ఉన్నాయి. ఈ సమయంలో నిజం పక్షాన నిలబడిన మా ప్రతి సైనికుడికి అండగా నిలుస్తా. కచ్చితంగా న్యాయం గెలుస్తుంది' అని సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో శుక్రవారం పోస్ట్ చేశారు. కాగా, రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగ పాలన దుర్యోధన, దుశ్శాసన దుర్నీతి లోకాన్ని తలపిస్తోంది. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తూ ప్రజల్ని చైతన్య పరుస్తున్న సోషల్ మీడియా యాక్టివిస్టులను కూటమి ప్రభుత్వం అడ్డూ, అదుపు లేకుండా వేధింపులకు గురి చేస్తోంది. ఈ నేపథ్యంలో బాధితులందరికీ అండగా ఉంటానని వైఎస్ జగన్ ధైర్యం నూరిపోశారు.

మెడికల్ పీజీ సీట్ల బ్లాకింగ్ స్కాంలో ఈడీ దూకుడు

▶ మొదటి పేజీ తరువాయి

కరీంనగర్ జిల్లా నగునూర్‌లోని ప్రతిమ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, నల్లగొండ జిల్లా నార్కెట్‌పల్లిలోని కామినేని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, ఖమ్మంలోని మమత మెడికల్ కాలేజీ, సంగారెడ్డిలోని ఎంఎన్‌ఆర్ మెడికల్ కాలేజీ, రంగారెడ్డి జిల్లా మొయినాబాద్‌లోని భాస్కర్ మెడికల్ కాలేజీ, మేడ్చల్‌లోని మెడిసిటీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, మహబూబ్‌నగర్‌లోని ఎస్‌వీఎస్ మెడికల్ కాలేజీ, సూరారంలోని మల్లారెడ్డి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, పటాన్‌చెరులోని మహేశ్వర మెడికల్ కాలేజీ, చేవెళ్లలోని పట్నం మహేందర్‌రెడ్డి మెడికల్ కాలేజీ, డెక్కన్ కాలేజ్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ప్రాంగణాల్లో ఈడీ సోదాలు జరిపింది. అందులో భాగంగా దర్యాప్తు కొనసాగిస్తున్న అధికారులు.. 12 కాలేజీలతో పాటు మరికొన్ని కాలేజీల యాజమాన్యాలకు కూడా సమన్లు జారీ చేసినట్టు తెలిసింది. అన్ని కాలేజీల ప్రతినిధుల నుంచి వివరాలు సేకరించడంతో పాటు పలు కీలక డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకుంటున్నారు. మొత్తం కాలేజీల నుంచి వివరాలు సేకరించిన తర్వాత కేసులో మరికొన్ని కీలక పరిణామాలు చోటు చేసుకునే అవకాశాలున్నాయనే చర్చ జరుగుతోంది.

హైదరాబాద్‌లోనే ఉన్నా

▶ మొదటి పేజీ తరువాయి

ఘటనలో మీరు 'ఈస్ట్ ఇండియా కంపెనీ'అంటూ సంబోధించిన సంస్థను బ్లాక్‌లిస్టులో పెట్టగలరా. కొడంగల్ లిఫ్ట్ ఇరిగేషన్ పనుల నుంచి ఆంధ్రా కాంట్రాక్టర్‌ను తొలగించే దమ్ముందా. సీఎం హోదాలో ఒక కాంట్రాక్టు సంస్థకు గులాంగిరి చేస్తున్నావా'అని కేటీఆర్ మండిపడ్డారు.

పుండు ఒక చోట.. మందు మరోచోట

'మూసీ ప్రాజెక్టు బాధితులను పట్టించుకోకుండా మరోచోట సీఎం పాదయాత్ర చేస్తూ పుండు ఒక చోట అయితే మందు మరోచోట అన్నట్టుగా వ్యవహరిస్తున్నారు. వేల ఇళ్లను కూల్చివేసేందుకు ప్రణాళికలు వేసి..లక్షలాది మందిని నిరాశ్రయులను చేసే ప్రణాళిక వేసిన సీఎం దొడ్డిదారిన మరోచోట పాదయాత్ర డ్రామా చేస్తున్నారు. లక్షలాది మంది ఆక్రందనలకు కేరాఫ్‌గా మారిన హైదరాబాద్ మూసీ పరీవాహక ప్రాంతంలో పాదయాత్ర చేసే ధైర్యం, చిత్తశుద్ధి సీఎంకు లేదు. దశాబ్దాలపాటు వ్యర్థాలు కలుస్తుంటే అరవై ఏళ్ల కళ్లుండీ చూడలేని కబోదుల్లా కాంగ్రెస్ వ్యవహరించింది. మూసీ దోపిడీ ప్రాజెక్టు కన్సల్టెంట్లతో మూడురోజుల పాటు చర్చించే సమయం సీఎంకు ఉంది. కానీ ఆరు గ్యారంటీల అమలుపై సమీక్షించేందుకు సమయం లేదా. మోసపూరిత హామీలను పక్కన పెట్టి కమీషన్ల కోసం మూసీ ప్రాజెక్టును నెత్తిన పెట్టుకు న్నారు. పాదయాత్ర చేసినా పొర్లుదండాలు పెట్టినా మూసీ పరీవాహక ప్రాంత ప్రజల వేదన మీకు శాపంగా మారుతుంది'అని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

నల్లగొండ నేతల అరెస్టు అక్రమం

ముఖ్యమంత్రి మూసీ పాదయాత్ర నేపథ్యంలో బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్త లను పోలీసులు అరెస్టు చేస్తున్నారు. ప్రజాపాలన అంటూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి, మంత్రులు పర్యటనలు చేసిన ప్రతీ సందర్భంలో బీఆర్‌ఎస్ నేతలను ముందస్తు, హౌస్ అరెస్టుల పేరుతో నిర్బంధానికి గురి చేస్తు న్నారు. ప్రధాన ప్రతిపక్షంగా ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే మా నేతల హక్కులను ప్రభుత్వం కాలరాస్తోంది. ఎన్ని నిర్బంధాలకు గురిచేసినా కాంగ్రెస్ ప్రభుత్వ అవినీతి, హామీల అమలులో వైఫల్యంపై ప్రజల తరఫున ప్రశ్నిస్తూనే ఉంటాం 'అని కేటీఆర్ పేర్కొన్నారు.

హ్యాపీ బర్త్ డే సీఎం రేవంత్

ఎక్స్ వేదికగా ప్రధాని మోదీ, కేంద్రమంత్రులు, రాష్ట్ర గవర్నర్ తదితరుల శుభాకాంక్షలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జన్మదినం సందర్భంగా పలువురు ప్రముఖులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఎక్స్ వేదికగా భారత ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర మంత్రులు నితిన్ గడ్కరీ, బండి సంజయ్‌కుమార్, రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ, కర్ణాటక, ఏపీ సీఎంలు సిద్దరామయ్య, ఎన్.చంద్రబాబునాయుడు, ఏపీ ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, సినీనటుడు చిరంజీవి, అమెరికా కాన్సుల్ జనరల్ జెన్నిఫర్ లార్సన్, యూకే కాన్సులేట్ జనరల్ గరెత్ విన్ ఓవెన్ తదితరులు శుభాకాంక్షలు తెలియజేసిన వారిలో ఉన్నారు. శుక్రవారం ఉదయం నుంచే కాంగ్రెస్‌నేతలు, కార్యకర్తలు పెద్ద ఎత్తున జూబ్లీహిల్స్‌లోని రేవంత్ నివాసానికి క్యూ కట్టారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, మంత్రులు పొన్నం ప్రభాకర్, డి.శ్రీధర్‌బాబులు కలిసి రేవంత్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. రాహుల్, ప్రియాంకలతో కలిసి సెల్ఫీ దిగుతున్న ఫొటోను మంత్రి కొండా సురేఖ రేవంత్‌కు బహూకరించారు. గాంధీభవన్‌లో సీఎం రేవంత్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు.

ప్రభుత్వ టీచర్లకు గ్రేడింగ్!

▶ మొదటి పేజీ తరువాయి

ఆ టీచర్‌ను బాధ్యుడిని చేయాలని భావిస్తున్నారు. ఒక టీచర్ చెప్పే సబ్జెక్టులో వరుసగా ఐదేళ్ళ పాటు అతి తక్కువ ఫలితాలు వస్తే కొన్ని చర్యలు తీసుకునే అంశాన్ని కమిషన్ ప్రభుత్వానికి సిఫారసు చేసినట్లు సమాచారం. కాగా గ్రేడింగ్ విధానంపై అన్ని వర్గాలతో చర్చించి, అవసరమైన విధివిధానాలను రూపొందించాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉన్నట్టు తెలిసింది. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్లు, ఎస్జీటీలు..ఇలా మొత్తం 1,26,518 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. ప్రభుత్వ, ఎయిడెడ్ కలిపి 30,178 స్కూళ్ళుంటే, ఇందులో 28,80,809 మంది విద్యాభ్యాసం చేస్తున్నారు.

టీచర్లకు గ్రేడింగ్ సరికాదు

రకరకాల పరీక్షల్లో ప్రతిభ చూపిన తర్వాతే ప్రభుత్వ టీచర్‌గా ఎంపిక చేస్తున్నారు. విద్యార్థుల ఉత్తీర్ణత ఆధారంగా ర్యాంకింగ్ ఇవ్వడం ఎంతమాత్రం సరికాదు. ప్రభుత్వ స్కూళ్ళకు వచ్చే పేద విద్యార్థుల నేపథ్యాన్ని ప్రభుత్వం తెలుసుకోవాలి. స్కూల్‌లో ఉండే సమయంలో తప్ప, ఇంటికెళ్ళితే చదివించే పరిస్థితి ఉండదు. ఈ విషయంలో తల్లిదండ్రుల్లో అవగాహన పెంచాల్సిన అవసరం ఉంది. అంతే తప్ప టీచర్లనే బాధ్యులను చేయడం సరికాదు.

– సయ్యద్ షౌకత్ అలీ (టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు)

ముందు మౌలిక వసతులు కల్పించాలి

ప్రభుత్వ స్కూళ్ళలో చాలీ చాలని వసతులున్నాయి. పైగా ఈ స్కూళ్లలో పేద వర్గాల నుంచి వచ్చే విద్యార్థులే అత్యధిక సంఖ్యలో చదువుతున్నారు. వారికి నాణ్యమైన విద్య అందించాలని ప్రతి టీచర్‌కూ ఉంటుంది. మంచి ఫలితాలు రావాలంటే అందుకు తగిన వాతావరణం, వసతులు కల్పించాలి. మంచి ఫలితాలకు వీలుగా తగిన మార్పులు, చేర్పులు చేయాలి. ప్రైవేటు స్కూళ్ళతో పోటీ పెట్టడం సరికాదు. ర్యాంకింగ్ ఇవ్వడం ఎంతమాత్రం సరికాదు.

– పింగిలి శ్రీపాల్ రెడ్డి (పీఆర్‌టీయూ టీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు)

జిల్లా వార్తలు

ఏఎన్‌ఎం శిక్షణకు దరఖాస్తు గడువు పొడిగింపు

ఖమ్మంఅర్బన్: ఖమ్మంలోని మహిళా ప్రాంగణంలో ఏఎన్‌ఎం శిక్షణ కోసం దరఖాస్తుల స్వీకరణ గడువును ఈనెల 16వరకు పొడిగించినట్లు ప్రాంగణం మేనేజర్ వేల్పుల విజేత తెలిపారు. ఇంటర్‌లో ఏ గ్రూప్ అయినా పూర్తిచేసి, 17 ఏళ్ల నిండిన మహిళా అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఉమ్మడి జిల్లాలోని అభ్యర్థులు ఎస్సెస్సీ, ఇంటర్ మెమోలు, 4నుంచి 10వ తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్లు, ఆధార్, కుల ధృవీకరణ పత్రాలే కాక రెండు ఫొటోలతో పాటు కమిషనర్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్, తెలంగాణ, హైదరాబాద్ పేరిట తీసిన రూ.200 డీడీతో తమ కార్యాలయానికి వస్తే ఆన్‌లైన్ చేస్తామని తెలిపారు.

'చర్యల్లో జాప్యం ఎందుకు?'

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం జిల్లాలో కస్టమ్స్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్) వ్యవహారంలో అక్రమాలు జరిగినట్లు తేలినా మిల్లర్లపై చర్యల్లో ఎందుకు జాప్యం చేస్తున్నారని సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ ప్రశ్నించారు. ఉమ్మడి జిల్లాలో సీఎంఆర్ విషయమై అక్రమాలు జరగగా, అధికారుల పాత్ర ఉందని తెలిపారు. కొణిజర్ల మండలంలోని ఓ మిల్లు యాజమాన్యాన్ని రూ.81 కోట్లు చెల్లించాలని ఆదేశించి వదిలేయడం సరికాదన్నారు. ఇకనైనా ఆస్తులు జప్తు చేసి బాధ్యులపై అధికారులపై చర్యలు తీసుకోవాలని ఓ ప్రకటనలో ఆయన డిమాండ్ చేశారు.

వర్క్‌బుక్‌ల సరఫరా కోసం టెండర్ల ఆహ్వానం

భద్రాచలంటౌన్: ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని గిరిజన సంక్షేమ శాఖ పరిధి ప్రాథమిక, ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు వర్క్‌బుక్‌ల సరఫరా కోసం టెండర్లు స్వీకరిస్తున్నట్లు ఐటీడీఏ పీఓ బి.రాహుల్ తెలిపారు. 3 నుంచి 5వ తరగతి విద్యార్థులు 5,611 మందికి 12,06,224 పేజీల పుస్తకాలు ముద్రించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ప్రింటింగ్ ప్రెస్‌ల యజమానులు నిర్ణీత రుసుంతో తీసిన డీడీతో దరఖాస్తులను డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయంలో ఈ నెల 12వ తేదీలోగా అందజేయాలని సూచించారు. ఐటీడీఏ కార్యాలయంలో 13న టెండర్లు పరిశీలించి ఖరారు చేస్తామని తెలిపారు.

జిమ్నాస్టిక్స్ కోచ్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మంస్పోర్ట్స్: ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో జిమ్నాస్టిక్స్ కోచ్ నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీవైఎస్‌ఓ టి.సునీల్‌కుమా ర్‌రెడ్డి తెలిపారు. ఎన్‌ఐఎస్ పూర్తిచేసిన వారు లేదా సీనియర్ క్రీడాకారులు ఈనెల 14వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా జిల్లా యువజన క్రీడల శాఖ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.

గైర్హాజరీ కార్మికులకు కౌన్సెలింగ్



సింగరేణి ప్రధాన కార్యాలయం

- సింగరేణి వ్యాప్తంగా ఏరియాల్లో నిర్వహణ
- గతంలో గనుల వారీగా కార్మికులకు కౌన్సెలింగ్
- ఇప్పుడు జీఎం కార్యాలయంలో కుటుంబీకుల సమక్షాన...

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలో ఉద్యోగులకు రకరకాల సౌకర్యాలు కల్పిస్తుండగా.. పనిపై అనుభవం లేని వారికి శిక్షణ కూడా ఇపిస్తున్నారు. అయితే, కొందరు విధులు నిర్వర్తిస్తూ సంస్థ అభివృద్ధికి సహకరిస్తుండగా, మరికొందరు గైర్హాజరవుతున్నారు. ఈమేరకు కౌన్సెలింగ్ నిర్వహించి మార్పు తీసుకురావాలని యాజమాన్యం నిర్ణయించింది. ఈనెల 5వ తేదీ మంగళవారం నుంచి కుటుంబీకులతో సహా ఏరియా జీఎం కార్యాలయాల్లో కౌన్సెలింగ్ ఇస్తున్నారు. గైర్హాజరీ కార్మికుల సమస్యలు తెలుసుకుని పరిష్కరించడం, దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు ఉంటే మెడికల్ బోర్డుకు రిఫర్ చేయడం ఈ కౌన్సెలింగ్ లక్ష్యంగా చెబుతున్నారు. ఆతర్వాత కూడా విధులకు గైర్హాజరైతే డిస్మిస్ చేసేలా ప్రణాళిక సిద్ధం చేసినట్లు సమాచారం.

0–75 మస్టర్లలోపు 1900 మంది

సింగరేణి వ్యాప్తంగా 24 భూగర్భగనులు, 18 ఓపెన్ కాస్ట్ గనులు, అనుబంధ విభాగాల్లో 39,640 మంది పనిచేస్తున్నారు. వీరిలో ఈ ఏడాది సెప్టెంబర్ 30వ తేదీ వరకు 0 నుంచి 75 మస్టర్లలోపు పనిచేసిన సుమారు 1,900 మందిని గుర్తించారు. గత నెల రోజులుగా గనులు, విభాగాల్లో వీరికి కౌన్సెలింగ్ ఇచ్చినా మార్పు రాకపోవడంతో మంగళవారం నుంచి జీఎం కార్యాలయాల్లో కుటుంబాలతో సహా కౌన్సెలింగ్ ప్రారంభించారు. కాగా, తక్కువ మస్టర్లు కలిగిన కార్మికుల్లో మణుగూరు ఏరియా నుంచి 597 మంది, కొత్తగూడెం ఏరియాలో 121 మంది, ఇల్లెందులో 302, ఆర్జీ–1లో 175, ఆర్జీ–2లో 108, ఆర్జీ–3లో 126, భూపాలపల్లిలో 262, బెల్లంపల్లిలో 9, మందమర్రిలో 79, శ్రీరాంపూర్‌లో 114, ఎస్టీపీపీలో ఒకరు ఉన్నారు.

ఏటా 100 మస్టర్లు తప్పనిసరి

సంస్థలో ఉద్యోగిగా కొనసాగాలంటే వారానికి రెండు, ఏటా 52 వారాల్లో 100 మస్టర్లు తప్పనిసరి చేయాల్సి ఉంటుంది. అయితే అండర్‌గ్రౌండ్‌లో పనిచేసే ఉద్యోగి 190 మస్టర్లు, సర్ఫేస్ విభాగాల్లో 240 మస్టర్లు చేస్తే బోనస్, లాభాల వాటా, ఇతర సదుపాయాలు వర్తిస్తాయి. కానీ కొందరు ఉద్యోగులు విధులకు సరిగ్గా హాజరుకాకపోవడంతో కౌన్సెలింగ్ నిర్వహించాలని యాజమాన్యం సిద్ధమైంది.

అందరినీ విధుల్లోకి రప్పించడమే ధ్యేయం



కొత్తగూడెం ఏరియాలో గడచిన తొమ్మిది మాసాల్లో కనీసం 75మస్టర్లు చేయని కార్మికులను గుర్తించి కౌన్సెలింగ్ ఇచ్చాం. కానీ పది శాతం మందిలోనే మార్పు వచ్చింది. దీంతో మిగతా వారికి కుటుంబలతో సహా జీఎం కార్యాలయంలో కౌన్సెలింగ్ ఇవ్వాలని నిర్ణయించాం. ఉద్యోగులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నందున విధులకు రప్పించాలనేదే మా ధ్యేయం.

– ఎం.శాలేంరాజు, కొత్తగూడెం ఏరియా జీఎం

ప్రతీ టన్ను బొగ్గుపై రూ.6 వేలు నష్టం

సింగరేణి డైరెక్టర్ వెంకటేశ్వరరెడ్డి



వెంకటేశ్వరరెడ్డి, డైరెక్టర్

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి పరిధిలోని భూగర్భగనుల్లో ప్రతీ టన్నుకు బొగ్గు ఉత్పత్తికి సుమారు రూ.10 వేల వ్యయం అవుతుండగా.. అమ్మడం ద్వారా రూ.4వేలే వస్తున్నాయని, తద్వారా రూ.6 వేల నష్టం వాటిల్లుతోందని సింగరేణి డైరెక్టర్ (ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్) జి.వెంకటేశ్వర్‌రెడ్డి తెలిపారు. కొత్తగూడెంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ఓపెన్‌కాస్ట్ గనుల్లో ప్రైవేట్ సంస్థలు రోజుకు సుమారు 14 లక్షల క్యూబిక్ మీటర్ల ఓబీ తీస్తుండగా, భారీ యంత్రాలు కలిగిన సంస్థ తరఫున మాత్రం 2లక్షల క్యూబిక్ మీటర్లు తీయడమే కష్టంగా మారిందన్నారు. ఈ మేరకు ఉత్పత్తి, ఉత్పాదకత పెంపుపై ఉన్నతాధికారులు సహా కార్మికుడి వరకు దృష్టి సారించాలని, భూగర్భ గనుల్లో యంత్రాల పనిగంటలు పెంచితేనే లక్ష్యం మేరకు ఉత్పత్తి సాధ్యమవుతుందని తెలిపారు. కాగా, కొందరు కార్మికుల పనితీరు మారేలా యూనియన్ నాయకులు దృష్టి సారించాలని, అధికారులు కూడా చిత్తశుద్ధితో పనిచేయాలని సూచించారు. సంస్థలో బొగ్గు అమ్మకాల ద్వారా కేవలం 30శాతం లాభాలే వస్తున్నందున ఈ పరిస్థితి మారాల్సి ఉందని తెలిపారు. గతనెలలో 'ఉజ్వల సింగరేణి – కార్మికుల పాత్ర' అంశంపై నిర్వహించిన సదస్సుల ఫలితాలు ఎలా ఉంటాయో వేచి చూడాల్సి ఉందని డైరెక్టర్ చెప్పారు.

నవ లిమిటెడ్‌కు 'రాష్ట్ర ఇండస్ట్రీ అవార్డ్'



మంత్రి నుంచి అవార్డు స్వీకరిస్తున్న నవలిమిటెడ్ యాజమాన్యం

పాల్వంచ: పాల్వంచలోని నవ లిమిటెడ్ సంస్థకు రాష్ట్ర ఇండస్ట్రీ అవార్డ్–2023 దక్కింది. హైదరాబాద్‌లో శుక్రవారం జరిగిన సమావేశంలో రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చేతుల మీదుగా కంపెనీ సెక్రటరీ వీఎస్‌ఎన్.రాజు, చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ సుల్తాన్ బేగ్, జనరల్ మేనేజర్(సీఎస్‌ఆర్) ఎంజీఎం.ప్రసాద్ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా యూనిట్ హెడ్, వైస్ ప్రెసిడెంట్ ఎల్‌వీ.శరత్‌బాబు మాట్లాడుతూ పారిశ్రామికాభివృద్ధిలో నవ లిమిటెడ్ కృషిని గుర్తించి అవార్డు అందజేశారని తెలిపారు.

ఏడేళ్లయినా జాడే లేని బోర్డు



జమలాపురంలోని వేంకటేశ్వరస్వామి ఆలయం

- జమలాపురం ఆలయ ట్రస్టుబోర్డు ఏర్పాటులో జాప్యం
- ఫలితంగా ఆలయ అభివృద్ధిపై నీలినీడలు
- దాతలు చేపట్టిన నిర్మాణాలే తప్ప ప్రభుత్వం చొరవ శూన్యం
- పర్యవేక్షణ సైతం ఇన్‌చార్జ్ ఈఓతోనే సరి

ఎర్రుపాలెం: తెలంగాణ తిరుపతిగా పిలిచే ఎర్రుపాలెం మండలంలోని జమలాపురం శ్రీవెంకటేశ్వర స్వామి వారి ఆలయానికి పాలక మండలి (ట్రస్టు బోర్డు) ఏర్పాటులో ఎడతెగని జాప్యం జరుగుతోంది. ఫలితంగా ఆలయ అభివృద్ధిలో ముందడుగు పడటం లేదు. 2017లో ఏర్పాటు చేసిన పాలక మండలి గడువు ముగిసి ఏడేళ్లు దాటినా పాలకుల్లో చలనం లేకపోవడం గమనార్హం.


పాలకమండలి ఉంటే..

ఆలయానికి పాలకమండలి ఉంటే అభివృద్ధికి చొరవ తీసుకునే అవకాశముంటుంది. ప్రభుత్వం నుంచి నిధుల మంజూరుకు ప్రయత్నిస్తూనే దాతలను కలిసి విరాళాల సేకరణకు దోహదపడతారు. అంతేకాక అభివృద్ధి, ఉత్సవాల సమయాన ఏర్పాట్ల పర్యవేక్షణ సులువవుతుంది. కానీ, పాలకమండలి లేక ఇవేవీ జరగడం లేదు. ఇది పక్కన పెడితే అటు ప్రభుత్వం, ఇటు అధికారులైనా చొరవ చూపడం లేదు. దీంతో దాతల చేయూతతో చేపట్టిన నిర్మాణాలే తప్ప ఆలయ ఆవరణలో ఎలాంటి సౌకర్యాల కల్పన ఊసే లేదు. ఇటీవల ఆలయ సందర్శనకు వచ్చిన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను కలిసిన పలువురు పాలకమండలి విషయమై విన్నవించారు. జిల్లా నుంచి డిప్యూటీ సీఎంతో పాటు ఇద్దరు మంత్రులు ఉన్నా పేరెన్నికగన్న జమలాపురం ఆలయానికి ట్రస్ట్ బోర్డు ఏర్పాటులో జాప్యం జరుగుతుండటంపై భక్తులు పెదవి విరుస్తున్నారు.

ఈఓ నియామకంలోనూ అలసత్వం

జమలాపురం ఆలయ నిర్వహణ, పర్యవేక్షణ కోసం అసిస్టెంట్ కమిషనర్ స్థాయి అధికారిని నియమించాలి. కానీ, దశాబ్ద కాలంగా ఇన్‌చార్జ్ ఈఓతోనే సరిపెడుతున్నారు. ప్రస్తుతం ఇన్‌చార్జ్ ఈఓగా ఉన్న జగన్మోహన్‌రావుకు ఖమ్మంలోని శ్రీనర్సింహస్వామి గుట్ట దేవాలయం, మారెమ్మ ఆలయం, కూసుమంచి మండలం జీళ్లచెరువులోని రామాలయం, శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం, మధిరలోని మృత్యుంజయస్వామి వారి ఆలయాల బాధ్యతలు కూడా అప్పగించారు. దీంతో సదరు అధికారి ఏ ఆలయ నిర్వహణపైనా దృష్టి సారించలేని పరిస్థితులు నెలకొన్నాయి. ఫలితంగా వారానికి ఒకటి, రెండు రోజులు మాత్రం వస్తుండటంతో పనులన్నీ సిబ్బందితోనే కానిచ్చేయాల్సి వస్తోంది. ఓ వైపు పాలక మండలి లేక, మరోవైపు రెగ్యులర్ ఈఓ లేక ఆలయ అభివృద్ధి, నిర్వహణ కష్టంగా మారిన తరుణాన ఇకనైనా ప్రభుత్వం స్పందించాలని భక్తులు కోరుతున్నారు.

త్వరలోనే నోటిఫికేషన్ వచ్చే అవకాశం



జమలాపురం ఆలయ పాలక మండలి నియామకానికి త్వరలో నోటిఫికేషన్ వెలువడే అవకాశముంది. ఆలయ చైర్మన్‌గా ఫౌండర్ ట్రస్టీ వ్యవహరిస్తారు. నోటిఫికేషన్ వస్తే మరో 13మంది సభ్యుల నియామకం జరుగుతుంది. వీలు మేర అందుబాటులో ఉంటూ భక్తులకు ఇబ్బంది లేకుండా పర్యవేక్షిస్తున్నా.

–కె.జగన్మోహన్‌రావు, ఆలయ ఇన్‌చార్జ్ ఈఓ

ఇంకెప్పుడు బోర్డు ఏర్పాటు చేస్తారు?



జమలాపురం ఆలయ అభివృద్ధిపై పాలకులు చిత్తశుద్ధి చూపడంలేదు. గత ప్రభుత్వాల్లోనూ ఇలాగే ఉంది. దాతలే రూ.కోట్ల నిధులతో నిర్మాణాలు చేపట్టారు తప్ప ప్రభుత్వం తరఫున జరిగిన పనులేవీ లేవు. వాహనాల పార్కింగ్ సహా అన్నీ అస్తవ్యస్తంగా ఉన్న నేపథ్యాన ఇకనైనా స్పందించాలి.

–నూతక్కి నర్సింహారావు, రేమిడిచర్ల

అభివృద్ధికి నిధులు కేటాయించాలి



ఎంతో ప్రసిద్ధి చెందిన శ్రీవేంకటేశ్వరస్వామి వారి ఆలయ అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి సారించి నిధులు మంజూరు చేస్తే బాగుంటుంది. ఇక్కడ దాతలు చేపట్టిన నిర్మాణాలే కనిపిస్తున్నాయి. చిన్న తిరుపతిగా పేరున్న జమలాపురం ఆలయ అభివృద్ధిపై దృష్టి సారించాలి.

–గూడూరు వెంకటసత్యనారాయణరెడ్డి, బనిగండ్లపాడు